TGTEL/2026/A1889

# హైదరాబాద్ మిర్రర్

ప్రతి ఉదయం.. జన హృదయం

ఎడిటర్ & పబ్లిషర్ : మాకం గంగాధర్ సంపుటి : 01 సంచిక :83 మంగళవారం 23 జూన్ 2026 వెల : 5/-

Circulation : Hyderabad, Rangareddy, Nalgonda, Yadadri Bhuvanagiri, Suryapet, Mahabubnagar, Khammam, Nizamabad, Sangareddy, Adilabad



02



02

### మహిళా సాధికారతకు

# కాంగ్రెస్ పెద్దపీట..

- ఇంటింటికీ ప్రజా ప్రభుత్వ సంక్షేమం : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- పదేళ్ల గత పాలకుల నిర్లక్ష్యానికి చెక్.. ఇందిరమ్మ ఇళ్లతో పేదలకు అండ
- 30 నెలల్లో రూ. 67 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు పంపిణీ

జూన్22(హైదరాబాద్ మిర్రర్)

రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న విప్లవాత్మక సంక్షేమ పథకాల లబ్ధి ప్రతి ఇంటికీ చేరుతోందని, ఈ అద్భుత ప్రగతిని మహిళా కాంగ్రెస్ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి విస్తృతంగా ప్రచారం చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు పిలుపునిచ్చారు.సోమవారం ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా కాంగ్రెస్ సమీక్షా సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళా లోకానికి సమాన అవకాశాలు కల్పించడంతో పాటు, వారిని ఆర్థికంగా, రాజకీయంగా బలోపేతం చేయడమే ధ్యేయంగా ఇందిరమ్మ రాజ్యం పనిచేస్తోందని ఆయన స్పష్టం చేశారు.గత పాలకుల పదేళ్ల నిరంకుశ పాలనలో పేద ప్రజలు ఇళ్ల కోసం ఎదురుచూసి అలసిపోయారని భట్టి విక్రమార్క విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అర్హులైన ప్రతి పేదవానికి ఇల్లు కట్టుకునేందుకు ఐదు లక్షల రూపాయల ఆర్థిక సాయం అందిస్తోందని గుర్తుచేశారు. "గత ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిన ఘనత మా ప్రభుత్వానిదే. ఈ ఏడాది కూడా నియోజకవర్గానికి 2,000 చొప్పున ఇళ్లు కేటాయించాం. ఇంకా ఎవరైనా అర్హులు ఉండి ఇళ్లు రాకుంటే మా దృష్టికి తీసుకురండి, వారికి తప్పకుండా మంజూరు చేస్తాం" అని హామీ ఇచ్చారు.పేద పిల్లల ఉన్నత చదువుల కోసం ఫీజు రీఇంబర్స్‌మెంట్‌ను పకడ్బందీగా అమలు చేస్తున్నామని, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ కింద వంద రోజుల పని కల్పిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదివే విద్యార్థుల డైట్ చార్జీలను 40 శాతం, కాస్మోటిక్ చార్జీలను 200 శాతం పెంచినట్లు వివరించారు.



### కీలక సంస్థల భద్రతలో సీఐఎస్ఎఫ్ కు

# పెను సవాళ్లు

- దేశ ఆర్థిక వ్యవస్థకు కీలకమైన సంస్థలపై దాడే శత్రువుల ప్రధాన లక్ష్యం
- ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధం కండి
- ఆధునిక సాంకేతికతను సమకూర్చుకోండి
- అవసరమైన అన్ని వనరులను అందించేందుకు కేంద్రం సిద్ధం
- ప్రపంచంలోనే అత్యాధునిక భద్రతా దళంగా సీఐఎస్ఎఫ్ ను తీర్చిదిద్దుతాం
- మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేస్తాం
- సీఐఎస్ఎఫ్‌లో మహిళల భాగస్వామ్యం ప్రశంసనీయం
- పర్యావరణ పరిరక్షణలో సీఐఎస్ఎఫ్ సేవలు భేష్
- జవాన్ల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నాం
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యలు

జూన్22(హైదరాబాద్ మిర్రర్)



న్యూఢిల్లీలోని సీజీఓ కాంప్లెక్స్‌లో సీఐఎస్ఎఫ్ నూతన ప్రధాన కార్యాలయ భవనానికి శంకుస్థాపన చేసిన కేంద్ర మంత్రిప్రస్తుతం ప్రపంచ రాజకీయాలు, భద్రతా పరిస్థితులు అత్యంత సంక్లిష్టంగా మారిన నేపథ్యంలో సీఐఎస్ఎఫ్ కు కొత్త భద్రతా సవాళ్లు ఎదురవుతున్నాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఆధునిక యుద్ధాలు కేవలం దేశ సరిహద్దులపైనే కాకుండా, ఒక దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచే విద్యుత్ కేంద్రాలు, ఓడరేవులు, విమానాశ్రయాలు, విద్యుత్ గ్రిడ్‌లు, వ్యూహాత్మక సంస్థలు శత్రువులకు ప్రధాన లక్ష్యాలుగా మారుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో దేశంలోని కీలక సంస్థల భద్రతా బాధ్యత మరింత పెరిగిందన్నారు. యుద్ధాల ముప్పులు కేవలం భౌతిక దాడులకే పరిమితం కావడం లేదని, సైబర్ దాడులు, డిజిటల్ విధ్వంసం, డ్రోన్ సాంకేతికత దుర్వినియోగం వంటి హైబ్రిడ్ ప్రమాదం పొంచి ఉందన్నారు.



### కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో

# సీఎం భేటీ

- కిషన్ రెడ్డితో కలసి వెళ్లిన రేవంత్
- మెట్రో రెండోదశ విస్తరణ తదితర ప్రాజెక్టులపై చర్చ

న్యూఢిల్లీ,జూన్22(హైదరాబాద్ మిర్రర్):

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటన కొనసాగుతోంది. పర్యటనలో భాగంగా రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సీఎం భేటీ అయ్యారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో కలిసి రైల్వేమంత్రితో రైల్ భవన్‌లో ఆయన సమావేశమయ్యారు. హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్-2 అనుమతులపై వారు చర్చించారు. ఐఆర్ఎఫ్‌సీ రుణ నిధుల విడుదలపైనా నేతలు సమీక్షించినట్లు సమాచారం. ఇటీవల కిషన్‌రెడ్డికి రేవంత్‌రెడ్డి బహిరంగ లేఖ రాశారు. హైదరాబాద్ మెట్రో రైలుకు ఐఆర్ఎఫ్‌సీ రుణం త్వరగా వచ్చేలా చూడాలని కోరారు. రైల్వేమంత్రితో భేటీ ఏర్పాటు చేయించాలని కోరారు. ఈ క్రమంలో తాజా సమావేశానికి ప్రాధాన్యం ఏర్పడింది.

## ఇబ్బంది పెట్టిన ప్రతీ ఒక్కరికీ సమాధానం ఇస్తా

చిట్టినాయుడిని

వదిలిపెట్టే ప్రసక్తి లేదు

వర్ధన్నపేట కార్యకర్తల భేటీలో

కెటిఆర్ ఘాటు హెచ్చరిక

వరంగల్,జూన్22(హైదరాబాద్ మిర్రర్):

వచ్చే ఐదేళ్లు ఎవ్వరినీ మరచిపోమని, సిఎం చిట్టి నాయుడును అస్సలు వదిలిపెట్టమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. వర్ధన్నపేట నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు.







### ఎన్నికలు ఎప్పుడు జరిగినా కాంగ్రెస్‌కు

# వంద ఖాయం

- ఓట్, సీట్ చోరీలో బిజెపి నిమగ్నం
- సర్ ప్రక్రియ ఓట్ల తొలగింపుకే ప్రాధాన్యం
- బూత్ లెవెల్ ఏజంట్ల శిక్షణలో టీపీసీసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

హనుమకొండ,జూన్22(హైదరాబాద్ మిర్రర్):

సర్ పేరిట దేశంలో ప్రజాస్వామ్యంపై దాడి జరుగుతోందని.. గతంలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ లేదని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. హనుమకొండలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ బూత్ లెవెల్ ఏజంట్ల శిక్షణా కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు పాల్గొని ప్రసంగించారు. నాడు ఓటును జోడించే కార్యక్రమం జరిగితే.. నేడు ఓటును తొలగించే కార్యక్రమం జరుగుతోందని ఆరోపించారు. బెంగాల్‌లో ఓట్ చోరీ చేసి అడ్డదారిన బీజేపీ గెలిచిందని దుయ్యబట్టారు. ఓట్లేకాదని.. మీనాక్షి నటరాజన్ రాజ్యసభ సీటును కూడా దొంగిలించారని విమర్శించారు. ఇక దేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం ఎక్కడుందని ప్రశ్నించారు. ఓట్ల చోరీయే కాకుండా సీట్ల చోరీకి కూడా భాజపా పాల్పడుతోందని మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శించారు.



# నటుడు చిరంజీవితో బిజెపి అధ్యక్షుడు రామ్ భేటీ

### మోడీ 12 పాలనపై పుస్తకాలు అందచేత

హైదరాబాద్,జూన్22(హైదరాబాద్ మిర్రర్):

తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవిని భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీకి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో రాజకీయ, సినీ వర్గాల్లో విస్తృత చర్చకు దారితీసింది. గత కొన్నేళ్లుగా ప్రత్యక్ష రాజకీయాలకు పూర్తిగా దూరంగా ఉంటూ సినిమాలపైనే దృష్టి సారించిన చిరంజీవిని బీజేపీ కీలక నేత కలవడం వెనుక అసలు ఉద్దేశం ఏమిటనే అంశంపై పలు ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి.

02

### ఆర్డీఎస్ నీటిపై

# రాజీలేదు

రైతుల ప్రయోజనాలు కాపాడి తీరుతాం

నీటిపారుదల శాఖ అధికారులతో మంత్రి ఉత్తమ్ సమీక్ష

హైదరాబాద్,జూన్22(హైదరాబాద్ మిర్రర్):



తెలంగాణ హక్కుల పరిరక్షణెళి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్‌లో తెలంగాణకు కేటాయించిన నీటి వాటాపై రాజీ ఉండదని తేల్చిచెప్పారు. ఆర్డీఎస్ ఆయకట్టు రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని వెల్లడిం చారు. సోమవారం సచివాలయంలో నీటిపారుదల శాఖ అధికారులతో మంత్రి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. రాజోలి బండ డైవర్షన్ స్కీమ్, తుంగభద్ర డ్యామ్‌పై చర్చించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ.. తుంగభద్ర జలాల వినియోగంపై తెలంగాణ హక్కులను బలంగా వినిపించాలని అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు.

02

02

### భూమి గురించి అడిగితే

# ఎస్‌బిఐపై పగబట్టారు



రాయదుర్గం భూమల వేలంపై హరీష్ రావు ఫైర్

మహబూబ్‌నగర్,జూన్22(హైదరాబాద్ మిర్రర్):

హైదరాబాద్‌లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు అప్పటి ప్రభుత్వం ఎకరం భూమిచ్చిందని, అయితే...రేవంత్ రెడ్డి బ్యాంక్‌కు ఇచ్చిన భూమిని అమ్మేసిండని మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు మండిపడ్డారు. అంతేగాకుండా ఇప్పుడు ఎస్‌బిఐ మీద పగపట్టిండని మండిపడ్డారు. అచ్చంపేట బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. ఎస్‌బీఐకి ఇచ్చిన భూమిని వేలానికి ఇచ్చిండు.. భూమిని అమ్మేసిండు. అమ్మేస్తే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కోర్టుకు వెళ్లింది. మాకు ఎకరం భూమి ఇచ్చిర్రు. ఇది కూడా ఉచితంగా ఏం ఇయ్యలేదు. మేము దాదాపు రూ.20 కోట్లు పెట్టి ఈ భూమి కొనుక్కున్నమని.. ఈ భూమి మా పొజిషన్‌లో ఉన్నది. పైసల్ పెట్టి కొన్న మా భూమి రేవంత్ రెడ్డి ఎట్లా అమ్ముకున్నడు.. అని హైకోర్టుకు పోయారన్నారు.కోర్టు వాళ్లు పైసలు పెట్టి కొన్నది నిజమే కదా ఈ అమ్మకం తప్పు అని స్టే ఇచ్చింది. ఖతం రేవంత్ రెడ్డి ఎస్‌బీఐ మీద పగపట్టిండు.

# పేదలకు ఇళ్లు -రాజకీయాలకు కాదు

## మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

## డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీ పారదర్శంగా నిర్వహించాలి

## ప్రజల అవసరాలే ప్రాధాన్యం... రాజకీయాలు కాదు



హైదరాబాద్ మిర్రర్ బాలాపూర్ ప్రతినిధి

జూన్22 :- మహేశ్వరం తెలంగాణ రాష్ట్రంలో కే. చంద్రశేఖర్ రావు నాయకత్వంలో పేదలకు గౌరవప్రదమైన జీవనం కల్పించాలనే లక్ష్యంతో డబుల్ బెడ్‌రూమ్ గృహ పథకం అమలు చేయబడిందని పేర్కొన్నారు. సోమవారం డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ పంపిణీ పారదర్శంగా నిర్వహించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ను కలిసి వినతిపత్రాన్ని అందించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఎలక్ట్రానిక్ మీడియాతో మాట్లాడుతున్నారు ఎన్నికల ముందు వరకు లక్షల సంఖ్యలో ఇళ్ల నిర్మాణం పూర్తిచేసి, అర్హులైన పేదలకు పంపిణీ చేసినట్లు తెలిపారు.ఆ సమయంలో పార్టీలు, కులాలు, మతాలు అనే భేదం లేకుండా అర్హత ఆధారంగా దరఖాస్తులను పరిశీలించి ఇళ్లు కేటాయించామని, "ఇల్లు లేని పేదవాడికి పార్టీతో సంబంధం ఉండకూడదు" అనే భావనతో ముందుకు వెళ్లామని చెప్పారు.ఇంకా కొన్ని ప్రాంతాల్లో నిర్మాణ పనులు చివరి దశలో నిలిచిపోయాయని, కొన్నిచోట్ల ఫ్లోరింగ్, డోర్లు, ఇతర మౌలిక పనులు మాత్రమే మిగిలి ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం మారిన తర్వాత పెండింగ్‌లో ఉన్న ఇళ్లను పూర్తి చేసి అర్హులకు అందించాలని పలుమార్లు విజ్ఞప్తి చేసినా ఆశించిన స్థాయిలో స్పందన లేదన్నారు.డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ విషయంలో రాజకీయ పక్షపాతం లేకుండా గతంలో వచ్చిన దరఖాస్తులను మళ్లీ పరిశీలించి అర్హులందరికీ పారదర్శకంగా కేటాయించాలని కోరారు. కేవలం ఒక పార్టీకి చెందిన వారికి మాత్రమే ప్రయోజనం చేకూరే విధంగా నిర్ణయాలు తీసుకోవడం సరైంది కాదన్నారు.అలాగే నియోజకవర్గ అభివృద్ధి నిధులు, పెండింగ్ పనులు, కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ వంటి ప్రజా అవసరాల పనులను రాజకీయ కోణంలో నిలిపివేయకుండా పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ప్రజల అవసరాలే ప్రాధాన్యం... రాజకీయాలు కాదు అని ఆమె పేర్కొన్నారు.

## శ్రీ శ్రీ శీతాల బొడ్రాయి విగ్రహ పునర్ ప్రతిష్టా కార్యక్రమానికి బీజేపీ నాయకులకు ఆహ్వానం

హైదరాబాద్ మిర్రర్ బాలాపూర్ ప్రతినిధి

జూన్22 :- మహేశ్వరం నియోజకవర్గం జిహెచ్ఎంసి పరిధిలోని బాలాపూర్ గ్రామంలో శ్రీ శ్రీ శీతాల బొడ్రాయి (నాభిశిల) విగ్రహ పునర్ ప్రతిష్టా కార్యక్రమం బాలాపూర్ గ్రామంలో 25 జూన్ నుంచి 28 జూన్ వరకు నిర్వహించబడుతున్నది ఈ యొక్క కార్యక్రమానికి 27 వ తేదీ ఉదయం 10 గం నుండి మధ్యాహ్నం 2 గం ల సమయం లో హాజరై అమ్మవారి దీవెనలు పొందవలసిందిగా కోరుతూ సోమవారం బిజెపి చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు, భారత ప్రభుత్వ విప్ కొండా విశ్వేశ్వర్ రెడ్డి ని మరియు పార్లమెంట్ సభ్యులు మహబూబ్ నగర్, తెలంగాణ ఎఫ్సిఐ చైర్మన్ డీకే అరుణ ని కలిసిన బిజెపి రాష్ట్ర కోపరేటివ్ సెల్ కన్వీనర్ కొలను శంకర్ రెడ్డివారి టీమ్ తో కలసి ఆహ్వానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు దొడ్డి శ్రీశైలం, బిజెపి రంగారెడ్డి జిల్లా ఎస్సి మోర్చా సెక్రెటరీ గుండె నాగార్జున సీనియర్ నాయకులు సాంబ రవి, మునగాల ప్రభాకర్ రెడ్డి, ఓబీసీ మోర్చా నాయకులు గంగారం సురేష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



## మిత్రుడి పుట్టినరోజున.. అనాథల ఆకలి తీర్చిన స్నేహితులు

### చౌటుప్పల్ అమ్మానాన్న ఆశ్రమంలో

### ఆరుట్ల 'బ్రదర్స్ యూత్' అన్నదానం

సంస్థాన్ నారాయణపురం, జూన్ 22(హైదరాబాద్ మిర్రర్ ):

ప్రాణస్నేహితుడి పుట్టినరోజును పురస్కరించుకుని ఆరుట్ల గ్రామ యువత మానవత్వాన్ని చాటుకుంది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని అమ్మానాన్న అనాథ ఆశ్రమంలో ఆరుట్ల 'బ్రదర్స్ యూత్' సభ్యులు, స్నేహితులు, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అనాథలకు, అభాగ్యులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.తమ ప్రియతమ మిత్రుడి అకాల మరణాన్ని జీర్ణించుకోలేకపోయిన స్నేహితులు.. అతని పుట్టినరోజున అనాథల ఆకలి తీర్చడమే నిజమైన నివాళి అని భావించి ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా స్నేహితులు మాట్లాడుతూ మా ప్రాణ స్నేహితుడు మమ్మల్ని విడిచివెళ్లడం తీరని లోటు. అతని పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ, ఈ పుట్టినరోజున ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం చేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆరుట్ల గ్రామ బ్రదర్స్ యూత్ సభ్యులు, స్నేహితులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## మంచిర్యాల సిమెంట్ కర్మాగారాన్ని పునరుద్ధరించండి

### సింగరేణి టేకోవర్‌తో యువతకు వేలాది ఉద్యోగాలు

### జిల్లా కలెక్టర్‌కు హెచ్ఎంఎస్ నాయకుల విజ్ఞప్తి

మంచిర్యాల,జూన్ 22 (హైదరాబాద్ మిర్రర్):

మంచిర్యాల జిల్లా పారిశ్రామిక ప్రగతికి చిరునామాగా నిలిచిన మంచిర్యాల సిమెంట్ కర్మాగారం (ఎంసీసీ)ను పునరుద్ధరించి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని హింద్ మజ్దూర్ సభ (హెచ్ఎంఎస్) జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.ఎంసీసీ మూతపడటంతో వేలాది మంది కార్మికులు,వారి కుటుంబాలు ఉపాధి కోల్పోయారని,జిల్లా ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రతికూల ప్రభావం పడిందని ఆయన పేర్కొన్నారు.సంస్థకు చెందిన పారిశ్రామిక భూములు, ఆస్తులను ఇతర అవసరాలకు వినియోగించకుండా పరిరక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు.సుమారు 438 ఎకరాల భూమిని పరిశ్రమల అభివృద్ధికే వినియోగించేలా చర్యలు తీసుకోవాలని,రాష్ట్ర ప్రభుత్వం లేదా





సింగరేణి కాలరీస్ సంస్థ ఆధ్వర్యంలో కర్మాగారాన్ని పునఃప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు.కార్మికులకు రావాల్సిన జీతాలు,భవిష్యనిధి,గ్రాట్యుటీ తదితర బకాయిలను వెంటనే చెల్లించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.కార్మిక సంఘాలు,ప్రజా సంఘాలు,ప్రజాప్రతినిధులతో చర్చించి కర్మాగారం పునరుద్ధరణకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని సూచించారు.రామగుండం ఎరువుల కర్మాగారం,కాగజ్‌నగర్ పేపర్ మిల్లు పునరుద్ధరణకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల మాదిరిగానే ఎంసీసీ విషయంలోనూ చొరవ చూపాలని కోరారు.ఎంసీసీ పునరుద్ధరణ జరిగితే వేలాది మందికి ఉపాధి లభించడంతో పాటు మంచిర్యాల జిల్లా పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చెందుతుందని నరెడ్ల శ్రీనివాస్ తెలిపారు.ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎస్ ఉపాధ్యక్షుడు ఎండీ షఫీ,జిల్లా కార్యదర్శి తగరం శ్రీనివాస్, నాయకులు ఎండీ ఉస్సేన్, దున్నపోతుల రమేష్,పల్లపు శ్రీనివాస్,చల్ల మోహన్,చిప్పకుర్తి దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## బొడ్రాయి మహోత్సవానికి గడ్డం ప్రసాద్ ని ఆహ్వానించిన చిగిరింత నరసింహారెడ్డి

హైదరాబాద్ మిర్రర్ బాలాపూర్ ప్రతినిధి

జూన్22 :- మహేశ్వరం నియోజకవర్గంలోని జీహెచ్ఎంసీ పరిధిలోని బాలాపూర్ లో ఈ నెల 25వ తేదీ నుంచి జరగనున్న బొడ్రాయి మహోత్సవ పండుగ కు సంబంధించిన ఆహ్వానాన్ని తెలంగాణ రాష్ట్ర శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కి అందజేసిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ వైస్ చైర్మన్ చిగిరింత నరసింహారెడ్డి మరియు నాయకులు సింగిరెడ్డి పెంటారెడ్డి, వంగేటి ప్రభాకర్ రెడ్డి, ఎర్ర జైహింద్, బాలింగని జంగయ్య, గిరికటి కృష్ణంరాజు గౌడ్, టేకుల శశిధర్ రెడ్డి, నిరుడు శ్రీరాములు, పగడాల ఉమేష్, బోనగిరి శ్రీనివాస్, సంరెడ్డి మహిపాల్ రెడ్డి తదితరులు.పాల్గొన్నారు



## విధులకు హాజరుకాని అంగన్వాడి టీచర్ పై చర్యలు తీసుకోవాలి

### కలెక్టర్కు వినతి పత్రం అందజేసిన సర్పంచ్ వసంత బాలు నాయక్

సశీస్థాన్ నారాయణపురం, జూన్ 22(హైదరాబాద్ మిర్రర్):

యాదాద్రి భువనగిరి జిల్లా సశీస్థాన్ నారాయణపురం మండలం వెంకం భావి తండా గ్రామపంచాయతీ నందు అంగన్వాడి టీచర్ గా, బూత్ లెవెల్ ఆఫీసర్ బిఎల్ఓ గా విధులు నిర్వహిస్తున్నటువంటి వడిత్య జక్క భర్త దీప్లా అనువారు విధులను సహక్రమంగా నిర్వహించడం లేదు, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రజలను ఇబ్బంది పెడుతున్నారు. అంగన్వాడి టీచర్ గా తమ విధులను సక్రమంగా నిర్వహించడం లేదు బాధ్యతరాహి తంగా ప్రవర్తిస్తూ బిఎల్ఓ గా తనకు అనుకూలమైన వారికి ఓటరు వయసు రాకుండానే ఓటు హక్కును కల్పించడం జరిగింది తన సొంత కూతురుకీ కూడా 18 సంవత్సరాలు నిండకుండానే తనకు ఓటు కల్పించే గత అసెంబ్లీ ఎన్నికలు పార్లమెంటరీ ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటును వినియోగించడం జరిగింది. అక్కడి నుంచి గత ఆరు నెలలుగా ఎవరైనా తమ ఓటరులో మార్పులు చేర్పులు చేసుకునేందుకు బిఎల్ ను అడగగా నాకు ఎటువంటి సంబంధం లేదు అంటూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రజలను ఇబ్బంది పెడుతున్నారు అంగన్వాడీ టీచర్గా కేవలం నెలకి రెండు మూడు రోజులు మాత్రమే వచ్చి హాజరు పట్టికలో సంతకాలు పెట్టి పిల్లలకి ఇచ్చేటువంటి పోషకాహారాలు కూడా బయట అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. అటు అంగన్వాడీ టీచర్ గా, బిఎల్ గా విదులను సక్రమంగా నిర్వహించకుండా నిర్లక్ష్యం వహిస్తూ ప్రజలను ఇబ్బంది పెడుతున్నటువంటి వడిత్య జక్క భర్త దీప్లా పై విచారణ జరిపి చర్య తీసుకోవాలని సర్పంచ్ కలెక్టర్కు ఫిర్యాదు చేశారు.

## సేద్యం చేసుకుంటున్న వ్యవసాయ భూములను ఆన్లైన్ చేసి డిజిటల్ పాస్ బుక్స్ ఇప్పించాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి వినతి పత్రం అందజేసిన రైతులు

సంస్థాన్ నారాయణపురం, జూన్ 22(హైదరాబాద్ మిర్రర్):

యాదాద్రి భువనగిరి జిల్లాసంస్థాన్ నారాయణపురం మండల రాచకొండ రెవిన్యూలో సర్వేనెంబర్ 192/1 పల్లగట్టు తండా, ఐదోనెలతండ కు చెందిన రైతుల భూములను మునుగోడు శాసనసభ్యుల కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు ఫారెస్ట్ డిపార్ట్మెంట్ అధికారులు మరియు రెవెన్యూ అధికారులు ఉమ్మడి సర్వే చేయించి హద్దులు నిర్ధారణ చేసి రైతుల భూముల్లో ఫారెస్ట్ భూముల వివాదము తొలగినందున రైతులందరికీ న్యాయం చేసే విధముగా జాయింట్ సర్వే ఆధారంగా కబ్జాలో ఉంది సేద్యం చేస్తున్న రైతులందరికీ డిజిటల్ పాస్ బుక్స్ ఇవ్వాలని ఎమ్మెల్యే కి వినతి పత్రం ఇవ్వనైనది. రైతులు పూర్వకాలము నుండి సేద్యం చేసుకుంటున్న వ్యవసాయ భూములను ఆన్లైన్ చేసి డిజిటల్ పాస్ బుక్స్ ఇప్పించి ప్రభుత్వపరంగా వచ్చే అనేక సబ్సిడీలను పొందే విధంగా నాకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ని కోరమైనది. వెంటనే స్పందించి ఎమ్మెల్యే కలెక్టర్ కి ఆదేశించడం జరిగింది. రైతు సమస్యలను పరిష్కరించి రైతులకు న్యాయం చేయాలని కోరనైనది. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కరెంటోతు శ్రీనివాస్ నాయక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు మందు గుల బాలకృష్ణ,మాజీ సర్పంచ్ లు, దోనూరు జైపాల్ రెడ్డి,బానోతు కిషన్ నాయక్,కట్రోతు సాగర్ నాయక్,మండల కాంగ్రెస్ నాయకులు కరంటోతు శ్రీరామ్ నాయక్ ,రైతులు కేలోతు బాలా నాయక్,రమావత్ బోజ నాయక్,రామావత్ సక్రు, కేలోత్ భీమా,కేలోతు రాజు, కేలోత్ వస్త్రం వాడితే భీమా కెలోతు జాను,కెలోతులక్కు తదితరులు పాల్గొన్నారు.



## బీఆర్ఎస్ ఎమ్మెల్యే కే.పీ. వివేకానంద వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతల ఆగ్రహం

కుత్బుల్లాపూర్:(హైదరాబాద్ మిర్రర్)

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు, బీఆర్ఎస్ నాయకులు కే.పీ. వివేకానంద ఇటీవల చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్రంగా మండిపడ్డారు. ఆయన చేసిన వ్యాఖ్యలు పూర్తిగా నిరాధారమైనవని, ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని కాంగ్రెస్ నేతలు విమర్శించారు. నియోజకవర్గంలోని ప్రజా సమస్యలపై దృష్టి సారించకుండా, అభివృద్ధిని విస్మరించి రాజకీయ విమర్శలు చేయడం సరికాదని వారు హితవు పలికారు. అభివృద్ధి పనులను అడ్డుకోవడమే లక్ష్యంగా బీఆర్ఎస్ నేతలు వ్యవహరిస్తున్నారని, ప్రజలు అన్నీ గమనిస్తున్నారని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీపైన గాని, కాంగ్రెస్ పార్టీ నాయకులపైన గాని ఇలాంటి అవాకులు చవాకులు మాట్లాడితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు ఏ.ఆర్. సాదు యాదవ్, యువజన నాయకులు పృథ్వి, శ్రీశైలం యాదవ్, గజేంద్ర , అమర్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

# సింధుజలాలపై అవసరమైతే యుద్ధం

## భారత్‌తో తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధం

## పాక్ రక్షణ మంత్రి ఖవాజా ప్రేలాపనలు

**ఇస్లామాబాద్,జూన్22(హైదరాబాద్ మిర్రర్):**

సింధు జలాల కోసం అవసరమైతే భారత్‌తో యుద్ధం చేస్తామని పాక్ ప్రగల్భాలు పలికింది. సింధు జలాల ఒప్పందం విషయంలో వెనక్కి తగ్గేది లేదని భారత్ స్పష్టం చేసిన నేపథ్యంలో, పాకిస్థాన్ రక్షణమంత్రి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. భారత్ చర్యలు తమ నీటి సరఫరాకు ముప్పు కలిగిస్తున్నాయని, అవసరమైతే ఆ దేశంపై యుద్ధానికి వెళ్లేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ తాజాగా హెచ్చరించారు. పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం సింధు జలాల ఒప్పందం అమలును భారత్ నిలిపివేసిన సంగతి తెలిసిందే. ఉగ్రవాదానికి పూర్తిగా, విశ్వసనీయంగా అడ్డుకట్ట వేయకపోతే ఒప్పందాన్ని పునరుద్ధరించే ప్రసక్తే లేదని భారత్ తేల్చి చెప్పింది. కాగా, పాకిస్థాన్‌కు వచ్చే నీటి ప్రవాహాన్ని తగ్గించే లేదా అడ్డుకునే ప్రయత్నాలు జరిగితే అది జాతీయ భద్రతా సమస్యగా మారుతుందని ఆసిఫ్ అన్నారు. పాక్ ఆర్థిక వ్యవస్థ, కోట్లాది మంది ప్రజల జీవనాధారం సింధు నదీ వ్యవస్థపై ఆధారపడి ఉందని ఆసిఫ్ అన్నారు. ఈ నేపథ్యంలో నీటి హక్కులను కాపాడుకునేందుకు అన్ని మార్గాలనూ ఉపయోగిస్తామని, అవసరమైతే యుద్ధం వరకు వెళ్లడానికి కూడా వెనుకాడబోమని ఆసిఫ్ హెచ్చరించారు. సింధు జలాల ఒప్పందం 1960లో కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం సింధు నదీ వ్యవస్థలోని ఆరు నదులను భారత్, పాకిస్థాన్‌కు సమానంగా కేటాయించారు. ఒప్పందం ప్రకారం రావి, బియాస్, స్లెటెజ్ నదులపై భారత్‌కు హక్కులుంటాయి. సింధు, జీలం, చీనాబ్ నదులపై పాకిస్థాన్‌కు హక్కులుంటాయి. అలాగే పాకిస్థాన్‌కు కేటాయించిన మూడు నదులపై కూడా భారత్‌కు కొన్ని పరిమిత హక్కులు ఉన్నాయి. పాక్‌కు కేటాయించిన నదులపై భారత్ జలవిద్యుత్ ప్రాజెక్టులు నిర్మించుకోవచ్చు. తాగునీరు, గృహ అవసరాలకు నీటిని వినియోగించుకోవచ్చు. అలాగే పరిమిత స్థాయిలో సాగునీటికి కూడా ఉపయోగించుకోవచ్చు. అయితే నదుల ప్రవాహాన్ని పూర్తిగా అడ్డుకునే హక్కు భారత్‌కు లేదు. ఃూగా, ఇటీవలి ఉగ్రవాద ఘటనల తర్వాత భారత్ ఈ ఒప్పంద అమలును నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఉగ్రవాదానికి మద్దతు కొనసాగితే పాత విధానంలో ఒప్పందం కొనసాగదని భారత్ స్పష్టం చేసింది. ఇటీవలి కాలంలో చీనాబ్, జీలం నదులపై కొన్ని ప్రాజెక్టులు నిర్మిస్తోంది. ఈ నిర్మాణాలపై పాకిస్థాన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది.

# మాస్కోపై విరుచుకుపడ్డ ఉక్రెయిన్

## డ్రోన్‌లతో వరుస దాడులతో

## రష్యా ఉక్కిరిబిక్కిరి

**మాస్కో,జూన్22(హైదరాబాద్ మిర్రర్):**

రష్యాపై ఉక్రెయిన్ భీకర దాడులు కొనసాగిస్తోంది. మాస్కో, దాని పరిసరాల ప్రాంతాలే లక్ష్యంగా ఆదివారం వందల డ్రోన్లతో విరుచుకుపడింది. వాటిలో దాదాపు 60 డ్రోన్లను కూల్చేసినట్లు రష్యా ఎయిర్ డిఫెన్స్ అధికారులు వెల్లడించారు. దాడుల నేపథ్యంలో నగరంలోని నాలుగు విమానాశ్రయాలు మూతపడ్డాయి. క్రిమియాపై కూడా ఉక్రెయిన్ దాడులకు పాల్పడుతుండడంతో అదనపు భద్రతా చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ముందుజాగ్రత్త చర్యగా క్రిమియాలో సోమవారం జరగాల్సిన అన్ని బహిరంగ కార్యక్రమాలను అధికారులు రద్దు చేశారు. సాధ్యమైనంత వరకు విద్యుత్ వినియోగాన్ని తగ్గించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మరోవైపు.. ఇంధన సదుపాయాలు, చమురు శుద్ధి కేంద్రాలపై కీవ్ దాడులు చేయడంతో క్రిమియా ప్రాంతంలో ఇంధన సరఫరాకు తీవ్ర అంతరాయం నెలకొంది. దీంతో నగరవ్యాప్తంగా ఉన్న పెట్రోల్ స్టేషన్లలో ప్రజలకు, ప్రభుత్వేతర సంస్థలకు ఇంధన విక్రయాలను నిలిపివేశారు. విరామం ఇవ్వకుండా ఉక్రెయిన్ ప్రతిరోజూ వందల డ్రోన్‌లతో విరుచుకు పడుతుండడంతో మాస్కో ఉక్కిరిబిక్కిరవుతోంది. ఈ క్రమంలోనే ఉక్రెయిన్‌లోని దక్షిణ ఒడెసా ప్రాంతంపై రష్యా చేసిన ప్రతిదాడుల్లో ఒకరు మరణించగా.. ముగ్గురు గాయపడినట్లు అధికారులు వెల్లడించారు. ఈ దాడుల్లో పలు వాహనాలు ధ్వంసమవ్వగా.. ఇంధన నిల్వ ట్యాంకులలో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి.

# అమెరికాకు షాకిచ్చిన చైనా

## పలు రక్షణ కంపెనీలపై ఆంక్షలు

**బీజింగ్,జూన్22(హైదరాబాద్ మిర్రర్):**

అమెరికాకు చెందిన 10 సైనిక సంబంధిత కంపెనీలపై చైనా ఆంక్షలు విధించింది. ఆయా కంపెనీలకు పౌర-మిలిటరీ వినియోగ వస్తువుల ఎగుమతిని నిషేధిస్తున్నట్లు తెలిపింది. వీటిల్లో రేథియాన్, లాక్‌హీడ్ మార్టిన్ వంటి ప్రముఖ సంస్థలు ఉన్నాయి. అగ్రరాజ్యం ఇటీవల తమ రక్షణ రంగ కాంట్రాక్టుల్లో చైనా టెక్ కంపెనీలను నిషేధించిన నేపథ్యంలో బీజింగ్ ఈ చర్యలు చేపట్టింది. దీంతో పాటు అమెరికాకు చెందిన 46 కంపెనీల నుంచి ఉత్పత్తులు కొనుగోలు చేయకుండా తమ ప్రభుత్వ రంగ సంస్థలను నిరోధించనున్నట్లు చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. అంతే కాకుండా ఇతర దేశాలు చైనా నుంచి కొనుగోలు చేసిన వస్తువులను.. ఆంక్షలకు గురైన అమెరికా కంపెనీలకు బదిలీ చేయడాన్ని నిషేధిస్తున్నట్లు తెలిపింది. చైనా సైన్యంతో సంబంధాలు ఉన్నాయని ఆరోపిస్తూ.. అలీబాబా, బైడూ సహా పలు టెక్ కంపెనీలపై ఈ నెల ఆరంభంలో అమెరికా రక్షణ శాఖ నిషేధం విధించింది. ఇకపై ఆయా కంపెనీలు అగ్రరాజ్య సైనిక కాంట్రాక్టులను పొందలేవని తెలిపింది. ఈ ఏడాది మే నెలలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చైనాలో పర్యటించిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో భేటీ అయిన ట్రంప్.. ఇరు దేశాల మధ్య పరస్పర వాణిజ్య సహకారంపై అంగీకారానికి వచ్చారు. అయితే, నెల తిరక్కుండానే బీజింగ్ కంపెనీలపై అగ్రరాజ్యం ఆంక్షలు విధించడం గమనార్హం. దీంతో బీజింగ్ కూడా ప్రతిచర్యలు చేపట్టింది.

## ఎన్‌టిఆర్ ట్రస్ట్‌లో భువనేశ్వరి పుట్టిన రోజు

ఎన్‌టిఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి తన పుట్టిన రోజును సోమవారం ఎన్‌టిఆర్ ట్రస్ట్‌లో తలసేమియా పిల్లలతో జరుపుకున్నారు. పిల్లలతో కలిసి కేక్ కట్ చేసి వారికి చాక్లెట్‌లు, గిఫ్ట్ హాంపర్స్‌ను పంచిపెట్టి, పిల్లలతో కలిసి భోజనం చేసి తదనంతరం పిల్లలతో ముచ్చటించడం జరిగింది. తలసేమియా బారినపడి తల్లడిల్లుతున్న బాలబాలికలను నారా భువనేశ్వరి అన్ని విధాలా ఆదుకుంటున్నారు. వీరి కోసం విశాఖపట్నం, హైదరాబాద్ నగరాలలో భారీ ఎత్తున 'తలసేమియా రన' ను 'యుఫోరియా మ్యూజికల్ నైట్' ను విజయవాడలో నిర్వహించారు. తలసేమియా వ్యాధి ఉన్నవారు నెలకు రెండుసార్లు రక్తమార్పిడి చేయించుకోవాల్సి ఉంటుంది. ఉచిత రక్తనిధి ద్వారా వందలాది చిన్నారులకు, వారి కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు. సామాన్యుల నుంచి సెలబ్రిటీల వరకు తలసేమియా వ్యాధిపై అవగాహన కల్పిస్తున్నారు. తలసేమియా బాధిత పిల్లలకు నారా భువనేశ్వరి ఒక ఆశాదీపంగా ఉంటున్నారు.

# ఖతార్ గ్యాస్ క్షేత్రంలో భారీ పేలుడు

## 54మందికి తీవ్ర గాయాలు..

## 18మంది ఆచూకీ గల్లంతు

**ఖతార్,జూన్22(హైదరాబాద్ మిర్రర్):**

ప్రపంచ గ్యాస్ వాణిజ్యానికి ఆయువుపట్టు వంటి ఖతార్ రస్ లఫాన్ క్షేత్రంలో బర్జాన్ ప్లాంట్‌లో ఆదివారం అర్ధరాత్రి భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 54 మంది గాయపడగా.. 18మంది జాడ గల్లంతైంది. ఈ పేలుడుతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. అయితే పేలుడుకు గల కారణాలు తెలియాల్సి ఉంది. అలాగే ప్రాణనష్టంపై వివరాలు అందాల్సి ఉంది. వాస్తవానికి ఇరాన్-అమెరికా యుద్ధం వేళ ఐఆర్‌జీసీ దళాలు ఈ గ్యాస్ క్షేత్రాన్ని లక్ష్యంగా చేసుకొని భారీగా దాడులు చేశాయి. దీంతో గ్యాస్ ప్లాంట్ దెబ్బతిని భారీగా ఉత్పత్తి సామర్థ్యం పడిపోయింది. కొన్నాళ్ల క్రితమే ఇరాన్-అమెరికా మధ్య ఉద్రిక్తతలు తగ్గు ముఖం పట్టడంతో గ్యాస్ ఉత్పత్తి తిరిగి ప్రారంభించేందుకు ఖతార్ చర్యలు చేపట్టింది. ఖతార్ రాజధాని దోహాకు ఈశాన్యంగా 80 కిలోమీటర్ల దూరంలో పర్షియన్ గల్ఫ్ తీరంలో రస్ లఫాన్ నగరం ఉంది. భౌగోళికంగా వ్యూహాత్మక ప్రదేశంలో ఉండటంతో ఇది ఆసియా, ఐరోపా ఎగుమతులకు అత్యంత అనువైన ప్రదేశం. ఇక్కడి నుంచి గ్యాస్ దాదాపు 30 దేశాలకు పైగా ఎగుమతి అవుతోంది. వీటిల్లో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలైన జపాన్, దక్షిణ కొరియా, భారత్, ఐరోపా సమాఖ్య, చైనా వంటి దేశాలు ఉన్నాయి. భారత ఎల్‌ఎన్‌జీ దిగుమతుల్లో ఖతార్ నుంచి 40-47శాతం వరకు హర్మూజ్ జలసంధి దాటుకొని వస్తున్నాయి. ఈ గ్యాస్ క్షేత్రాన్ని ఖతార్ ఎనర్జీనే నిర్వహిస్తుంది. భారత్-ఖతార్ మధ్య 2024లో 78 బిలియన్ డాలర్ల విలువైన ఒప్పందం జరిగింది. దీని ప్రకారం 2028 నుంచి 20 ఏళ్లపాటు ఏటా 7.5 మిలియన్ టన్నుల ఎల్‌ఎన్‌జీ సరఫరా చేయాల్సి ఉంటుంది. ఖతార్ ఎల్‌ఎన్‌జీ భారత్‌లో విద్యుత్తు, ఎరువుల ఉత్పత్తి, పరిశ్రమలు, గృహోపయోగానికి చాలా కీలకం. అమెరికా, ఆఫ్రికాతో పోల్చుకొంటే ఇక్కడి నుంచి భారత్‌కు గ్యాస్ తరలించడం చాలా చౌక.

# ఫిలిప్పీన్స్‌లో కాల్పుల కలకలం

## స్కూల్లో కాల్పులకు తెగించిన సాయుధులు

## ముగ్గురు విద్యార్థులు

## అక్కడిక్కడే మృతి

**న్యూఢిల్లీ,జూన్22(హైదరాబాద్ మిర్రర్):**

ఫిలిప్పీన్స్‌లో దారుణం జరిగింది. టాక్లోబన్‌లోని శాన్ హోసే నేషనల్ హైస్కూల్‌లో కాల్పుల ఘటన తీవ్ర కలకలం సృష్టించింది. ఇద్దరు సాయుధులు అక్రమంగా పాఠశాల ఆవరణలోకి ప్రవేశించి విద్యార్థులపై విచక్షణా రహితంగా తుపాకులతో కాల్పులకు తెగబడ్డారు. ఈ దాడిలో ముగ్గురు విద్యార్థులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా.. మరో ఐదుగురికి తీవ్రమైన బబుల్లెట్ గాయాలు అయ్యాయి. ఫిలిప్పీన్స్‌లో కొద్దికాలంగా అక్రమ ఆయుధాల చలామణి పెరిగిపోయింది. దీంతో ఇటీవల తుపాకీ సంబంధిత నేరాలు సర్వసాధారణం అయిపోయాయి. అయితే, పాఠశాలల్లో కాల్పులకు తెగబడటం చాలా అరుదైన ఘటనని స్థానిక మీడియా, అధికారులు చెబుతున్నారు. ఈ పాఠశాలలో మొత్తం 1,500మంది విద్యార్థులు ఉండగా.. కాల్పుల ఘటనతో పాఠశాల సిబ్బంది సహా వారంతా బయటకు పరుగులు తీశారు. పాఠశాల యాజమాన్యం ఇచ్చిన సమాచారంతో పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి దాడికి ఉపయోగించిన తుపాకులను స్వాధీనం చేసుకున్నారు. అయితే, నిందితుల్లో ఒకరిని అదే పాఠశాలకు చెందిన విద్యార్థిగా పోలీసులు గుర్తించారు. మరోవైపు దాడిలో గాయపడిన ఐదుగురిని సమీప ఆస్పత్రులకు తరలించారు. ఈ ఘటనతో స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఈ మేరకు పాఠశాల చుట్టుపక్కల ప్రాంతమంతా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మరోవైపు ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. కాల్పులకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు.

# మీడియా అకాడమీలో ఎస్.ఐ.ఆర్‌పై అవగాహన సదస్సు

**హైదరాబాద్ :(హైదరాబాద్ మిర్రర్)**



ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై జర్నలిస్టులకు అవగాహన కల్పించేందుకు తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి సహకారంతో తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం నాంపల్లిలోని మీడియా అకాడమీ ఆడిటోరియంలో అవగాహన సదస్సు నిర్వహించింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య ఎన్నికల అధికారి కార్యాలయం తరపున బి. చెన్నయ్య, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ మరియు డి. చిరంజీవి, ఐటీ మేనేజర్ పాల్గొని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ (ఫ్రూ) ద్వారా ఎస్.ఐ.ఆర్ ప్రక్రియపై సమగ్ర వివరణ అందించారు. ఈ సందర్భంగా వారు ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ కార్యక్రమం ఉద్దేశ్యం, అర్హులైన ఓటర్ల నమోదు, వివరాల సవరణ, మార్పులు, తొలగింపులు, ఇంటింటి సర్వే తదితర అంశాలపై విపులంగా వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న జర్నలిస్టులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు ఇస్తూ ఎస్.ఐ.ఆర్‌కు సంబంధించిన సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటరు జాబితాల ప్రాధాన్యత ఎంతో కీలకమైందని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం చేపడుతున్న కార్యక్రమాలపై ప్రజలకు సరైన సమాచారం చేరవేయడంలో మీడియా కీలక పాత్ర పోషించాలని ఆయన అన్నారు. జర్నలిస్టులు ఎస్.ఐ.ఆర్ ప్రక్రియపై సమగ్ర అవగాహన పెంపొందించుకుని ప్రజలకు వాస్తవ సమాచారాన్ని అందించాలని సూచించారు. రాష్ట్రంలోని వివిధ ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా సంస్థలకు చెందిన జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొని అవగాహన సదస్సును సద్వినియోగం చేసుకున్నారు. ఈ కార్యక్రమం జర్నలిస్టులకు ఎంతో ఉపయోగకరంగా, సమాచారపూర్వకంగా సాగింది. ఈ కార్యక్రమంలో నాగులపల్లి వెంకటేశ్వరరావు, కార్యదర్శి, తెలంగాణ మీడియా అకాడమీ, వివిధ మీడియా సంస్థలకు చెందిన జర్నలిస్టులు పాల్గొన్నారు.

# సర్ ప్రక్రియపై జర్నలిస్టుకు అవగాహన

## ప్రెస్ అకాడమీ ఆధ్వర్యంలో సదస్సు

**హైదరాబాద్,జూన్ 22(హైదరాబాద్ మిర్రర్):**

ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ పక్రియపై జర్నలిస్టులకు అవగాహన కల్పించేందుకు తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి సహకారంతో తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం నాంపల్లిలోని మీడియా అకాడమీ ఆడిటోరియంలో అవగాహన సదస్సు నిర్వహించింది. కార్యక్రమానికి తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య ఎన్నికల అధికారి కార్యాలయం తరపున స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ బి. చెన్నయ్య మరియు డి. చిరంజీవి, ఐటీ మేనేజర్ పాల్గొని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎస్.ఐ.ఆర్ పక్రియపై సమగ్ర వివరణ అందించారు. ఈ సందర్భంగా వారు ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ కార్యక్రమం ఉద్దేశ్యం, అర్హులైన ఓటర్ల నమోదు, వివరాల సవరణ, మార్పులు, తొలగింపులు, ఇంటింటి సర్వే తదితర అంశాలపై విపులంగా వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న జర్నలిస్టులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు ఇస్తూ ఎస్.ఐ.ఆర్‌కు సంబంధించిన సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటరు జాబితాల ప్రాధాన్యత ఎంతో కీలకమైందని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం చేపడుతున్న కార్యక్రమాలపై ప్రజలకు సరైన సమాచారం చేరవేయడంలో మీడియా కీలక పాత్ర పోషించాలని ఆయన అన్నారు. జర్నలిస్టులు ఎస్.ఐ.ఆర్ పక్రియపై సమగ్ర అవగాహన పెంపొందించుకుని ప్రజలకు వాస్తవ సమాచారాన్ని అందించాలని సూచించారు. ఃూష్ట్రంలోని వివిధ ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా సంస్థలకు చెందిన జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొని అవగాహన సదస్సును సద్వినియోగం చేసుకున్నారు. ఈ కార్యక్రమం జర్నలిస్టులకు ఎంతో ఉపయోగకరంగా, సమాచారపూర్వకంగా సాగింది. కార్యక్రమంలో నాగులపల్లి వెంకటేశ్వరరావు, వివిధ మీడియా సంస్థలకు చెందిన జర్నలిస్టులు పాల్గొన్నారు.

# డబ్బులు లేక ఏ ఒక్కరూ చికిత్సకు దూరం కావద్దు

## 25 ఏళ్ల క్రితం ఓ సదాశయంతో ఈ ఆస్పత్రిని ప్రారంభించాం

## రజతోత్సవ వేడుకల్లో బసవతారకం చైర్మన్ బాలకృష్ణ

## చంద్రబాబు, వెంకయ్య, ఎన్టీఆర్ కుటుంబ సభ్యుల హాజరు

**హైదరాబాద్,జూన్22(హైదరాబాద్ మిర్రర్):**

పేదలకు అండగా ఉండాలనే లక్ష్యంతో బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ప్రారంభమైందని ఆసుపత్రి చైర్మన్, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. రోజుకి 35 నుంచి 40 శస్త్రచికిత్సలు చేస్తున్నామని.. వేలాది మందికి ఇది ఓ ఆశాకిరణమని చెప్పారు. బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి రజతోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏపీ సీఎం చంద్రబాబు, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు, కేంద్రమంత్రులు అనుప్రియ పటేల్, పెమ్మసాని చంద్రశేఖర్, తెలంగాణ మంత్రి దామోదర రాజనర్సింహ, ఏపీ మంత్రి సత్యకుమార్‌తో పాటు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, ఎన్టీఆర్ కుటుంబసభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడారు. నటుడిగా, ఎమ్మెల్యేగా కాదు.. ఓ కొడుకుగా మీ ముందు నిలుచున్నా. మా అమ్మ బసవతారకం క్యాన్సర్ బారిన పడినప్పుడు ఎంతో బాధపడ్డాం. డబ్బు ఉంది కాబట్టి గట్టిగా పోరాడగలిగాం. డబ్బు లేని వారు ఈ వ్యాధితో ఎలా పోరాడుతారని మా అమ్మ ప్రశ్నించారు. అప్పుడే ఈ ట్రస్ట్ ఏర్పాటు ఆలోచన వచ్చింది. 3.75 లక్షల మందికి ఓపీ సేవలు అందించాం. బాధతో ఆసుపత్రికి వచ్చే వారు నవ్వుతూ తిరిగి వెళ్లాలి అనేదే మా ఉద్దేశం. భారత్‌లోనే మొట్టమొదటి బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ కేంద్రం అప్పట్లో ప్రారంభించాం. ప్రభుత్వాలు మాకు ఎంతగానో సహకరించాయి. ఎన్నో సంస్థలు, ఎందరో దాతలు ఈ ప్రయాణంలో మాకు అండగా నిలిచారు. ఏ ఒక్క రోగి కూడా డబ్బు లేక క్యాన్సర్ చికిత్సకు దూరం కాకూడదు. 25 ఏళ్ల క్రితం చేసిన ప్రమాణాన్ని నిలబెట్టుకున్నాం.. భవిష్యత్తులోనూ కొనసాగిస్తాం. అమరావతిలో క్యాన్సర్ ఆసుపత్రి నిర్మిస్తాం. హైదరాబాద్‌లో సేవలు మరింత విస్తరిస్తాం అని బాలకృష్ణ అన్నారు. హైదరాబాద్ నోవాటెల్ హోటల్‌లో బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి రజతోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆస్పత్రి చైర్మన్ నందమూరి బాలకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరయ్యారు. దగ్గుబాటి వెంకటేశ్వరరావు- పురందేశ్వరి దంపతులు, కాంగ్రెస్ సీనియర్ నేత కేవీపీ, సినీనటి గౌతమి తదితరులు పాల్గొన్నారు. రజతోత్సవ వేడుకల సందర్భంగా ఆస్పత్రి ప్రస్థానం, వైద్య సేవలు, భవిష్యత్ విస్తరణ ప్రణాళికలపై చర్చించారు. క్యాన్సర్ చికిత్స రంగంలో ఆస్పత్రి అందిస్తున్న సేవలు ఆదర్శంగా నిలుస్తున్నాయని అతిథులు అభినందించారు.

# యూపీ లోఘోర అగ్నిప్రమాదం..

## 11 మంది సజీవదహనం

**లక్నో జూన్ 22 :.(హైదరాబాద్ మిర్రర్)**

యూపీ లక్నోలోని పూర్ణియాలో జరిగిన ఘోర అగ్నిప్రమాదంలో 11 మంది మరణించారు. కోచింగ్ సెంటర్ కింద ఉన్న ఫర్నిచర్ షాపులో తొలుత మంటలు చెలరేగి పైకి వ్యాపించాయి. అక్కడున్న కొందరు విద్యార్థులు ప్రాణాలు కాపాడుకోవడానికి కిందికి దూకేయగా మరికొందరు మంటల్లోనే చిక్కుకున్నారు. దీంతో 11 మంది సజీవ దహనమయ్యారు. ఏడుగురిని ఫైర్ సిబ్బంది రక్షించగా వారు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

# ఓట్లను తొలగించేందుకే బీజేపీ సర్ తెచ్చింది :మీనాక్షి నటరాజన్

**హైదరాబాద్ (హైదరాబాద్ మిర్రర్)**

తెలంగాణ ఓట్లను తొలగించేందుకే బీజేపీ సర్ తెచ్చిందని ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ ఆరోపించారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ. గతంలో ఓటు హక్కు ఇచ్చేందుకు సర్ జరిగింది. ఇప్పుడు బీజేపీ కోసమే ఎస్ఐఆర్ నడుస్తోంది. ఓటు హక్కు మాత్రమే కాదు పౌరసత్వాన్ని కూడా తొలగిస్తున్నారు. ఈ దేశ పౌరులను శరణార్థులుగా మార్చే పని చేస్తోంది. బీజేపీ అమానవీయ ప్రయత్నాలను మనమే అడ్డుకోవాలి అని అన్నారు.

# సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటన

## నాంపల్లి కోర్టుకు హాజరుకాని అల్లు అర్జున్

## షూటింగ్‌ల కారణంగా రాలేకపోయారని వివరణ

## విచారణ జూలై 6కు వాయిదా వేసిన కోర్టు

**హైదరాబాద్,జూన్22(హైదరాబాద్ మిర్రర్):**

హైదరాబాద్‌లో సంచలనం సృష్టించిన సంధ్యా థియేటర్ తొక్కిసలాట ఘటనకు సంబంధించిన కేసుపై నాంపల్లి కోర్టులో సోమవారం విచారణ జరిగింది. ఈ కేసులో నిందితులుగా పేర్కొన్న పలువురు కోర్టు ముందు హాజరుకాగా, సినీ నటుడు అల్లు అర్జున్ వ్యక్తిగత కారణాలతో హాజరు కాలేకపోయారని ఆయన తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. సంధ్య థియేటర్ కేసులో నాంపల్లి కోర్టుకు సినీనటుడు అల్లు అర్జున్ హాజరు కాలేదు. షూటింగ్ వల్ల వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని ఆయన కోరినట్లు సమాచారం. ఈ కేసుకు సంబంధించి ఇవాళ కోర్టుకు హాజరుకావాలని 19 మంది నిందితులకు ఇటీవల నాంపల్లి కోర్టు ఆదేశాలు జారీ చేసింది. అయితే, అల్లు అర్జున్ మినహా మిగతా నిందితులంతా న్యాయమూర్తి ఎదుట హాజరై బాండ్లపై సంతకాలు చేశారు. అనంతరం కేసు విచారణను న్యాయమూర్తి కేసు విచారణను జులై 6కి వాయిదా వేశారు. అనంతరం ఈ కేసు విచారణను జులై 6వ తేదీకి న్యాయమూర్తి వాయిదా వేశారు. ఈ కేసులో అల్లు అర్జున్‌ను ఎ11 నిందితుడిగా పోలీసులు చేర్చిన విషయం తెలిసిందే. వ్యక్తిగతంగా అర్జున్ కోర్టు ముందు హాజరు కావాలని సమన్లు జారీ చేశారు. అయితే అల్లు అర్జున్ గైర్హాజరుకు గల కారణాలను న్యాయస్థానానికి ఆయన తరఫు న్యాయవాది వివరించారు. సంధ్యా థియేటర్ యాజమాన్యాన్ని తొలి పదిమంది జామితాలో చేర్చగా, మొత్తం 23 మందిపై పోలీసులు ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ కేసులో 19 మంది నిందితులకు నాంపల్లి కోర్టు ఇప్పటికే సమన్లు జారీ చేసింది. ఈ ఘటన 2024 డిసెంబర్ 4వ తేదీన పుష్ప-2 బెనిఫిట్ షో సందర్భంగా హైదరాబాద్‌లోని సంధ్యా థియేటర్ వద్ద చోటుచేసుకుంది. భారీ సంఖ్యలో అభిమానులు థియేటర్‌కు చేరుకోవడంతో తొక్కిసలాట జరిగింది. ఘటనలో రేవతి అనే మహిళ మృతిచెందగా, ఆమె కుమారుడు శ్రీతేజ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ కేసు దర్యాప్తు పూర్తిచేసిన పోలీసులు 23 మందిని నిందితులుగా పేర్కొంటూ నాంపల్లి కోర్టుకు ఛార్జ్‌షీట్ సమర్పించారు. నిందితుల వ్యక్తిగత హాజరు ప్రక్రియ పూర్తయిన తర్వాత ఈ కేసులో పూర్తిస్థాయిలో విచారణ చేపట్టేందుకు నాంపల్లి కోర్టు సిద్ధమవుతోంది. ఈ కేసు సినీ, రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారగా, కోర్టు తదుపరి విచారణలో కీలక పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉంది.

# అమెరికాలో మరో తెలుగు విద్యార్థి మృతి

**హైదరాబాద్,జూన్22(హైదరాబాద్ మిర్రర్):**

ఉన్నత విద్య కోసం అమెరికాకు వెళ్లిన మరో తెలుగు విద్యార్థి అనూహ్యంగా ప్రాణాలు కోల్పోయాడు. తెలంగాణకు చెందిన 26 ఏళ్ల అరుణ్ సాయి రెడ్డి బొ÷-లలెందుల అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. అరుణ్ స్వస్థలం మహబూబ్‌నగర్. ప్రస్తుతం ఫ్లోరిడాలోని టెంపాలో నివసిస్తోన్న అతడు.. స్టెమ్ ఓపీటీలో ఉన్నాడు. ఫుల్ టైమ్ ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తోన్న అరుణ్.. జూన్ 19న ఉన్నట్టుండి అనారోగ్యానికి గురయ్యాడు. ఆసుపత్రికి తరలించినప్పటికీ ఫలితం లేకపోయింది. చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయాడు. మృతదేహాన్ని స్వదేశానికి తరలించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

# తల్లి మందలింపుతో పారిపోయిన అక్కాచెల్లెళ్లు

## ఏలూరులో ప్రత్యక్షమైన సోదరీమణులు

**హైదరాబాద్,జూన్22(హైదరాబాద్ మిర్రర్):**

తల్లి మందలించిందని ఇంటి నుంచి వెళ్లిపోయిన ముగ్గురు అక్కాచెల్లెళ్ల ఆచూకీని పోలీసులు కనుగొన్నారు. హైదరాబాద్‌లో అదృశ్యమైన ఆ ముగ్గురూ ఏపీలో ప్రత్యక్షమయ్యారు. ఈ ఘటన ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఫోన్ ఎక్కువగా చూస్తున్నారని తన ముగ్గురు కుమార్తెలను తల్లి మందలించింది. దీంతో ఆ ముగ్గురూ ఇంటి నుంచి వెళ్లిపోయారు. దీంతో తన పిల్లలు కనిపించడం లేదని వారి తల్లి పోలీసులను ఆశ్రయించారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టగా.. ఏలూరులో ఉన్నట్లు తేలింది. వారిని తిరిగి హైదరాబాద్ తీసుకొస్తున్నారు.

# భూపాలపల్లి జిల్లాలో దుర్ఘటన

## వాహనాలు తనిఖీ చేస్తుండగా దూసుకొచ్చిన లారీ

## డిటివో వెంకన్న అరక్కడిక్కడే మృతి

**జయశంకర్ భూపాలపల్లి,జూన్22(హైదరాబాద్ మిర్రర్):**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, గణపురం మండలం చెల్పూరు శివారులో సోమవారం విషాదకర ఘటన చోటుచేసుకుంది. రవాణా శాఖ కార్యాలయం ఎదుట జిల్లా రవాణా అధికారి డీటీఓ వెంకన్న వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా, బొగ్గు లోడుతో వెళ్తున్న ఓ లారీ అదుపుతప్పి ఆయనపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో వెంకన్నకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వెంకన్న మృతి పట్ల మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. వారి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

# తెలంగాణ అభివృద్ధికి బిఆర్ఎస్ మోకాలడ్డు

## పదేళ్లలో భ్రష్టు పట్టించిన నేతలే చిల్లర రాజకీయాలు

### హరీష్ రావు, కెటిఆర్‌ల తీరుపై ఎంపి ఆగ్రహం- సిఎం విజన్‌తో రాష్ట్రాభివృద్ధి చేస్తున్నారని చామల కితాబు

**యాదాద్రి భువనగిరి,జూన్22(హైదరాబాద్ మిర్రర్):**

తెలంగాణ అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి ఓ విజన్‌తో ముందుకెళ్తుంటే మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు జీర్ణించుకోలేకపోతున్నారని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ ఫ్రూట్ మార్కెట్, ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌తో విద్య, వైద్యం, రైతులకు మేలు చేయాలనే ఆలోచనతో సీఎం రేవంత్‌రెడ్డి ముందుకు పోతున్నారని వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్‌రెడ్డిపై బావ, బామ్మర్దులు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. సోమవారం భువనగిరిలో ఎంపీ చామల పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. కేటీఆర్ పదేళ్లు అధికారంలో ఉండి సినిమా వాళ్లతో అంటకాగి సినిమా మాటలు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. రాజకీయంలో సినిమా మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. ప్రజల జీవితాలు కేటీఆర్‌కు సినిమాలాగా కనపడుతున్నాయా.. అని కిరణ్ కుమార్ రెడ్డి ఆగ్రహించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలన సూపర్ హిట్ అనుకుంటున్నారా...అని ప్రశ్నించారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో మిగులు రాష్ట్రం అప్పుల రాష్ట్రంగా మారిందని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలన షోలే సినిమా కాదని వ్యంగ్యంగా అన్నారు. రేవంత్‌రెడ్డి రెండున్నరేళ్ల పాలన గురించి కేటీఆర్ మాట్లాడటం విడ్డూరంగా ఉందని సెటైర్లు గుప్పించారు. బీఆర్ఎస్ పాలనలో ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యం అయ్యాయని ఆరోపించారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థను గాడిలో పెట్టే ప్రయత్నం సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో రైతులకు వాస్తవ పరిస్థితులను వివరించి క్రాప్ డైవర్షన్‌పై అవగాహన కల్పిస్తున్నారని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో పండించిన ధాన్యం అత్యధిక దిగుబడి వస్తే కేంద్రప్రభుత్వం ఎందుకు కొనట్లేదని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని.. సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారని తెలిపారు. మెట్రోఫేజ్- 2 కోసం సంప్రదింపులు చేసి ఎల్ అండ్‌టీకి ఎగ్జిట్ ఇచ్చారని.. మెట్రోఫేజ్ -2ను పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని కిరణ్ కుమార్ రెడ్డి వివరించారు. మెట్రోఫేజ్-2పై బీఆర్ఎస్ రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. మెట్రోఫేజ్ -2పై కిషన్ రెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డి లేఖ రాశారని ప్రస్తావించారు. కేంద్రమంత్రుల అపాయింట్‌మెంట్ ఇప్పించాలని.. కలిసి అభివృద్ధిలో ముందుకెళ్దామని సీఎం అంటున్నారని అన్నారు. కేటీఆర్ బాధ్యతతో ప్రజల కోణంలో మాట్లాడాలని హితవు పలికారు. హైడ్రా పేరుతో ప్రజలను రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. హైడ్రా హైదరాబాద్ నగర అభివృద్ధిలో కీలకంగా మారిందని తెలిపారు. నాళాలు కబ్జాలు చేసి నిర్మాణాలు చేపట్టాలని హైడ్రా భావిస్తోందా...? అని ప్రశ్నించారు. హైదరాబాద్ నగరం ముంపునకు గురికాకుండా హైడ్రా కీలక పాత్ర పోషిస్తోందని వివరించారు. బీజేపీ ఓటు, సీటు చోరీల గురించి కేటీఆర్ ఎందుకు మాట్లాడట్లేదని ÷ర్ అయ్యారు. కేటీఆర్, హరీశ్‌రావు తమ ప్రభుత్వంపై చిత్తశుద్ధి లేని మాటలు మాట్లాడుతున్నారని కిరణ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.



# నాంపల్లి కోర్టులో విచారణ

## వర్చువల్‌గా హాజరైన హీరో అల్లు అర్జున్

**హైదరాబాద్,జూన్22(హైదరాబాద్ మిర్రర్):**

సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసులో నాంపల్లి కోర్టు విచారణకు హీరో అల్లు అర్జున్ వర్చువల్‌గా హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరుకు నాంపల్లి కోర్టు అనుమతివ్వడంతో ముంబై నుంచి వర్చువల్‌గా అల్లు అర్జున్ అటెండ్ అయ్యారు. ఈ కేసులో మిగిలిన నిందితులు వ్యక్తిగతంగా కోర్టు ముందు హాజరయ్యారు. ఈ కేసులో అల్లు అర్జున్‌ను ఏ 11 గా పోలీసులు చేర్చిన విషయం తెలిసిందే. ఈరోజు(సోమవారం) ఉదయం సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనకు సంబంధించి నాంపల్లి కోర్టులో విచారణ జరిగింది. ఈ కేసుకు సంబంధించి అల్లు అర్జున్ వ్యక్తిగతంగా కోర్టు ముందు విచారణకు హాజరుకావాల్సి ఉంది. సినిమా షూటింగ్‌ల కారణంగా అర్జున్ ముంబైలో ఉన్నారని, అక్కడి నుంచి వర్చువల్‌గా హాజరయ్యేందుకు అనుమతి ఇవ్వాలని ఆయన తరఫున న్యాయవాది మెమో దాఖలు చేయగా.. అందుకు కోర్టు అనుమతి ఇచ్చింది. దీంతో ఈరోజు మధ్యాహ్నం నాంపల్లి కోర్టు ముందు అల్లు అర్జున్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వర్చువల్‌గా హాజరయ్యారు. దీన్ని కూడా న్యాయస్థానం పరిగణనలోకి తీసుకుంది. ఈ కేసు తదుపరి విచారణను నాంపల్లి కోర్టు జులై 6కు వాయిదా వేసింది. ఆరోజు కూడా కోర్టుకు అల్లు అర్జున్ వ్యక్తిగతంగా హాజరుకానున్నారా లేక వర్చువల్‌గానే అటెండ్ అవుతారా అనేది చూడాల్సి ఉంది.

# బడంగ్‌పేటలో భారీ పేలుడు

## బెంగాల్‌కు చెందిన కార్మికుడి దుర్మరణం

**రంగారెడ్డి,జూన్22(హైదరాబాద్ మిర్రర్):**

రంగారెడ్డి జిల్లాలోని బడంగ్‌పేట్ ప్రాంతంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. ప్రమాదవశాత్తూ పేలుడు సంభవించడంతో ఓ కార్మికుడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ప్రమాదం జరిగింది. మృతుడిని పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాకు చెందిన అనూప్ ప్రధాన్‌గా (43) గుర్తించారు. జీవనోపాధి కోసం మూడు రోజుల క్రితమే ఆయన బడంగ్‌పేట్‌కు వచ్చి ఓ డెకరేషన్ గోదాంలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ ఘటన జరిగిన సమయంలో అనూప్ ప్రధాన్ చెత్త కుప్ప సమీపంలో ఉన్నాడు. ఆ సమయంలో చెత్తలో ఉన్న గుర్తుతెలియని పదార్థం ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలింది. ఈ ఘటన తీవ్రత చాలా ఎక్కువగా ఉండటంతో అనూప్ ప్రధాన్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. పేలుడు ప్రభావం తీవ్రంగా ఉండటంతో మృతుడి శరీర భాగాలు సుమారు 50 మీటర్ల దూరం వరకు ఎగిరిపడ్డాయి. చేతులు, కాళ్లు తునాతునకలైపోవడంతో ఘటనా స్థలం భయానకంగా మారింది. ఈ దృశ్యాలను చూసిన స్థానికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న వెంటనే మీర్‌పేట్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ఘటనా స్థలంలో ఆధారాలు సేకరించిన పోలీసులు పేలుడుకు కారణమైన పదార్థం ఏమిటన్న దానిపై దర్యాప్తు చేస్తున్నారు. ప్రస్తుతం పేలుడు ప్రమాదవశాత్తూ జరిగిందా, లేక చెత్త కుప్పలో పేలుడు పదార్థం ఉండటమే కారణమా అనే కోణాల్లో విచారణ చేపట్టారు. అవసరమైతే బాంబ్ స్క్వాడ్, ఫోరెన్సిక్ నిపుణుల సహాయంతో మరిన్ని వివరాలు సేకరించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. పేలుడుకు సంబంధించిన పూర్తి వివరాలు ఫోరెన్సిక్ నివేదిక అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది.

# ప్రత్యామ్నాయ పంటల విత్తనాలపై ప్రత్యేక దృష్టి

## 2,601 రైతు వేదికల్లో జూన్ 23 నుండి 30 వరకు నిర్వహణ

## ఒకే వేదికపై రైతులకు నాణ్యమైన విత్తనాలు

## రైతులకు అందుబాటులో అన్నిరకాల విత్తనాలు

## అందుబాటులో నానో యూరియా, నానో డీఏపీ

## ఎల్‌నినో పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపికపై అవగాహన

**హైదరాబాద్,జూన్22(హైదరాబాద్ మిర్రర్):**

ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వర్షాభావ పరిస్థితులను తట్టుకునే ఆరుతడి పంటల సాగును ప్రోత్సహించే లక్ష్యంతో పప్పు జాతి పంటలను, నూనె గింజ పంటలను, చిరుధాన్యాలు. కూరగాయ పంటల సాగును రైతులను ప్రోత్సహించే దిశగా రైతులకు ఆయా పంటలకు సరైన విత్తనాలను, నాణ్యమైన విత్తనాలను ఒకే వేదికపై అందుబాటులో ఉంచుటకు ప్రభుత్వం ఈకార్యక్రమాన్ని రూపొందించారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 2601 రైతు వేదికలలో ఈనెల 23వ తేదీ నుండి 30 తేదీ వరకు విత్తన మేళాలు నిర్వహించనుంది. ల్గ÷తులు తమ అవసరాలకు అనుగుణంగా వివిధ పంటల ధ్రువీకరించిన విత్తనాలను సరసమైన ధరలకు కొనుగోలు చేసుకునేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. రైతులకు నాణ్యమైన విత్తనాలే అందేలా వ్యవసాయ శాఖ విస్తృత ఏర్పాట్లు చేసింది. విత్తన మేళాల్లో పెసర, మినుము, కంది వంటి పప్పుధాన్య పంటల విత్తనాలతో పాటు నువ్వులు, వేరుశెనగ వంటి నూనె గింజల పంటల విత్తనాలు, వివిధ రకాల చిరుధాన్యాలు, కూరగాయల విత్తనాలు అందుబాటులో ఉంటాయి. అలాగే సమగ్ర పోషక యాజమాన్యంలో కీలక పాత్ర పోషిస్తున్న నానో యూరియా, నానో డీఏపీ వంటి ఆధునిక ఎరువులను కూడా రైతుల కొనుగోలుకు అందుబాటులో ఉంచుతున్నారు. ల్గ÷తుల అభిరుచులు, మార్కెట్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని హెచ్‌ఎంటీ సోనా వంటి సన్న రకాల విత్తనాలను కూడా అందుబాటులో ఉంచుతున్నారు.÷త్తన మేళాల సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులు, ఉద్యానవన శాఖ, శాస్త్రవేత్తలు రైతులకు విత్తనాల ఎంపిక, విత్తన శుద్ధి, సమగ్ర పంట యాజమాన్యం, ఎరువుల వినియోగం, నీటి యాజమాన్యం, చీడపీడల నివారణ తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నారు. అంతేకాకుండా ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలు, వాతావరణ పరిస్థితులకు అనుగుణమైన పంటల ఎంపికపై కూడా రైతులకు మార్గదర్శకాలు అందించనున్నారు. విత్తన మేళాలను రైతులు సద్వినియోగం చేసుకొని నాణ్యమైన ధ్రువీకరించిన విత్తనాలను కొనుగోలు చేసి శాస్త్రీయ సాగు పద్ధతులను అనుసరించడం ద్వారా అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయ సంచాలకులు డాక్టర్ బి. గోపి, ఐఏఎస్ కోరారు.

# మహారాష్ట్రలో కీలక రాజకీయ పరిణామం

## ఆరుగురు ఉద్దవ్ ఎంపిలు

## శిందే వర్గంలో చేరిక

**ముంబయి,జూన్22(హైదరాబాద్ మిర్రర్):**

మహారాష్ట్రలో కీలక రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. శివసేన (యూబీటీ)కు చెందిన ఆరుగురు ఎంపీలు శిందే నేతృత్వంలోని శివసేనలో చేరారు. దీంతో గడిచిన కొన్ని రోజులుగా శివసేన (యూబీటీ)లో చీలికపై జరుగుతున్న ప్రచారానికి తెరపడింది. 'ఆరు పులులు (ఎంపీలనుద్దేశించి) ఇప్పుడు అసలైన శివసేన ఫ్యామిలీలోకి వచ్చాయి. వారికి స్వాగతం. ఆపరేషన్ టైగర్ విజయవంతమైంది' అని మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ శిందే ప్రకటించారు. శిందే క్యాంప్‌లో చేరిన ఎంపీల్లో ఓం రాజే నింబాల్కర్, సంజయ్ దిన పాటిల్, సంజయ్ జాదవ్, సంజయ్ దేశ్‌ముఖ్, నగేష్ పాటిల్ అష్టికర్, బౌసాహెబ్ వక్చౌరే ఉన్నారు. మొత్తం 9 మంది ఎంపీల్లో ఆరుగురు శిందే క్యాంప్‌లో చేరడంతో పార్టీ ఫిరాయింపుల చట్టం వర్తించకుండా జాగ్రత్త పడినట్లు తెలుస్తోంది. నాలుగేళ్ల క్రితం 2022 జూన్ 22న 40 మంది ఎమ్మెల్యేలు తమతో వచ్చారన్న శిందే.. ఇప్పుడు ఏకంగా 'సిక్స్' కొట్టామని పేర్కొన్నారు. శివసేన రెండో విడత విస్తరణ ప్రణాళికగా ఈ చేరికను అభివర్ణించారు. మాజీ సీఎం ఉద్ధవ్ ఠాక్రే ఇటీవల ఢిల్లీలో పార్లమెంటరీ పార్టీ సమావేశం ఏర్పాటు చేయగా.. కేవలం ముగ్గురు ఎంపీలు మాత్రమే హాజరయ్యారు. దీంతో శివసేనలో మరోసారి చీలిక ప్రచారం ఊపందుకుంది. ఈ క్రమంలోనే కొన్ని రోజులుగా అధికార, విపక్ష కూటముల మధ్య మాటల యుద్ధం కొనసాగుతున్న వేళ తాజాగా ఆరుగురు ఎంపీలు శిందే క్యాంప్‌లో ప్రత్యక్షమయ్యారు. నియోజకవర్గ అభివృద్ధికి నిధులు అందడం లేదన్న కారణంతోనే తాము పార్టీ మారుతున్నట్లు రెబల్ ఎంపీలు చెప్పుకొచ్చారు.

# ఒకే ఇంట్లో నలుగురు అనుమానాస్పద మృతి

## భార్యాభర్తలతో పాటు, మరో ఇద్దరి మృతదేహాలుగా గుర్తింపు

**నల్లగొండ,జూన్22(హైదరాబాద్ మిర్రర్):**

నల్లగొండ పట్టణంలోని తెలంగాణ కాలనీలో విషాదం చోటుచేసుకుంది. ఒకే ఇంట్లో నలుగురు మృతి చెందిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. మృతుల్లో భార్యాభర్తలు సుల్తాన్, హసీనా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మరో ఇద్దరి వివరాలు ఇంకా తెలియరాలేదు. నల్లగొండ ప్రకాశం బజార్‌లో సుల్తాన్ బ్యాగుల వ్యాపారం నిర్వహిస్తుండగా, హసీనా ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నట్లు తెలిసింది. ఈ ఘటన ఆత్మహత్యా? లేక హత్యా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఇంట్లో నలుగురు మృతిచెందడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంఘటనా స్థలం నుంచి ఆధారాలను సేకరిస్తున్న పోలీసులు, మృతుల బంధువులు, స్థానికులను విచారిస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

మంగళవారం
23 జూన్ 2026




హైదరాబాద్ మిర్రర్
ప్రతి ఉదయం.. జన హృదయం



## బాలకృష్ణ- కొరటాల కాంబో

### 25న షూటింగ్ ప్రారంభానికి ముహూర్తం

బాలకృష్ణ కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వంలో ఓ సినిమా రానున్న విషయం తెలిసిందే. 'ఎన్‌బికె 112'గా ప్రచారంలో ఉంది. ఈ సినిమా షూటింగ్ త్వరలో ప్రారంభం కానుంది. తాజాగా ఆ వివరాలను చిత్రబృందం పంచుకుంది. జూన్ 25న వెంకటపాలెంలోని వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఈ సినిమా ప్రారంభోత్సవం జరగనుంది. ముఖ్య అతిథులుగా మంత్రులు నారా లోకేశ్, కందుల దుర్గేశ్ హాజరు కానున్నారు. మే నెలలో ఈ ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటించారు. ‘అధికారానికి ఉద్దేశం తోడైతే.. అది ఉద్యమంగా మారుతుంది‘ అనే పవర్‌ఫుల్ కొటేషన్‌తో టీమ్ దీనిపై అంచనాలు పెంచేసింది. కొరటాల శివ మార్కు సామాజిక సందేశంతో పక్కా మాస్ యాక్షన్ ఎంటర్ టైనర్‌గా ఈ సినిమా ఉండనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం బాలయ్య.. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో ఓ సినిమాలో నటిస్తున్నారు. 'వీరసింహారెడ్డి' తర్వాత బాలకృష్ణ – గోపీచంద్ మలినేని దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రమిది. కాజల్ కథానాయికగా నటిస్తుండగా.. మంచు మనోజ్ ఓ కీలక పాత్రని పోషిస్తున్నారు. ఈ రెండు సినిమాలను బాలకృష్ణ ఒకేసారి పూర్తి చేయనున్నట్లు వార్తలు వస్తున్నాయి.





## ప్రేక్షకుల దృక్కోణం మారింది

### అందుకే జాగ్రత్తలు తీసుకుంటున్నా

### : సాయిదుర్గా తేజ్

సాయి దుర్గా తేజ్ ప్రధానపాత్రలో తెరకెక్కుతోన్న చిత్రం 'సంబరాల ఏటిగట్టు'. రోహిత్.కె.పి దర్శకత్వంలో రానుంది. ఈ సినిమా విడుదల ఆలస్యం కావడంపై గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో రకరకాల చర్చలు నడుస్తున్నాయి. తాజాగా ఈ ఆలస్యంపై సాయి దుర్గా తేజ్ స్పందించారు. సినిమాల ఎంపికలో తాను ఎందుకు ఇంత సమయం అవసరమవుతోందో వివరించారు. ప్రస్తుతం ప్రేక్షకులు ఓటీటీల్లో ఎన్నో సినిమాలు, వెబ్‌సిరీస్‌లు వీక్షిస్తున్నట్లు తెలిపారు. అన్ని జానర్‌లలోని కంటెంట్ గురించి ఎన్నో విషయాలు నేర్చుకుంటున్నట్లు చెప్పారు. ప్రేక్షకుల ఆలోచనల్లో మార్పు వచ్చిందని అందుకే తన సినిమాల విషయంలో మరింత జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వాళ్లను మెప్పించాలంటే కథల ఎంపికలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించక తప్పదన్నారు. అందుకే కాస్త సమయం పడుతోందని స్పష్టం చేశారు. ఈ సినిమా కోసం తన సర్వస్వం ధారపోస్తూ... శాయశక్తులా శ్రమిస్తున్నట్లు గతంలో సాయి దుర్గా తేజ్ తెలిపారు. దర్శకుడు రోహిత్ విజన్ అందరికీ నచ్చేలా ఉంటుందన్నారు. మంచి బృందంతో కలిసి చేస్తున్న ఈ సినిమా తన కెరీర్‌లో ఒక అద్భుతంలా నిలిచిపోతుందని చెప్పారు.



# కలెక్షన్లలో మా ఇంటి బంగారం దూకుడు

## పాజిటివ్ టాక్‌తో ప్రేక్షకుల ఆదరణ




స్టార్ హీరోయిన్ సమంత ప్రధాన పాత్రలో నటించిన 'మా ఇంటి బంగారం' బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన వసూళ్లతో దూసుకుపోతోంది. దాదాపు మూడు సంవత్సరాల విరామం తర్వాత సమంత నుంచి వచ్చిన ఈ చిత్రం ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ పొందుతూ విజయపథంలో కొనసాగుతోంది. మొదటి రోజు నుంచే పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకున్న ఈ మూవీ, వీకెండ్‌లో మరింత జోరు చూపించి భారీ కలెక్షన్లను నమోదు చేసింది. సాధారణంగా స్టార్ హీరోల సినిమాలకు కనిపించే స్థాయిలో 'మా ఇంటి బంగారం'కు ప్రేక్షకుల నుంచి స్పందన లభిస్తోంది. మొదటి రోజు మంచి ఓపెనింగ్స్ సాధించిన ఈ చిత్రం, శనివారం, ఆదివారం రోజుల్లో మరింత మెరుగైన వసూళ్లను రాబట్టింది. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, కేవలం మూడు రోజుల్లోనే మా ఇంటి బంగారం సినిమా ఇండియా వైడ్ నెట్ కలెక్షన్లలో రూ.23.10 కోట్ల మార్కును దాటేసింది. ఈ మూడు రోజుల్లో సినిమా సాధించిన మొత్తం ఇండియా గ్రాస్ కలెక్షన్లు రూ.26.69 కోట్లకు చేరాయి.సమంతకు ఉన్న క్రేజ్ కారణంగా ఈ చిత్రానికి తెలుగు రాష్ట్రాల్లోభారీ స్పందన లభించింది. కేవలం తెలుగు వెర్షన్ నుంచే మూడో రోజు రూ.9.50 కోట్ల నెట్ కలెక్షన్లు రావడం విశేషం.కుటుంబ ప్రేక్షకులు, మహిళలు, యువత ఈ చిత్రానికి పెద్ద ఎత్తున థియేటర్లకు రావడంతో అనేక ప్రాంతాల్లో హౌస్‌ఫుల్ బోర్డులు కనిపించాయి.ముఖ్యంగా మౌత్ టాక్ సినిమాకు అతిపెద్ద బలంగా మారింది. సినిమా చూసిన ప్రేక్షకులు సోషల్ మీడియాలో తమ అభిప్రాయాలను పంచుకోవడం, కుటుంబంతో కలిసి చూడదగిన చిత్రంగా ప్రశంసించడం వల్ల వసూళ్లు రోజురోజుకూ పెరుగుతున్నాయి. తెలుగు చిత్ర పరిశ్రమలో లేడీ ఓరియెంటెడ్ సినిమాలకు భారీ ఓపెనింగ్స్ సాధించడం అరుదుగా కనిపిస్తుంది. అయితే 'మా ఇంటి బంగారం' ఆ రికార్డులను తిరగరాస్తూ, సమంత స్టార్‌డమ్‌కు మరోసారి నిదర్శనంగా నిలిచింది. సినిమాలో సమంత నటన, ఎమోషనల్ సన్నివేశాలు, యాక్షన్ ఎపిసోడ్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. చాలా కాలం తర్వాత ఆమె పూర్తి స్థాయి ప్రధాన పాత్రలో కనిపించడంతో అభిమానులు కూడా థియేటర్లకు భారీగా తరలివస్తున్నారు. ఈ చిత్రానికి దర్శకురాలు నందిని రెడ్డి తనదైన శైలిలో కుటుంబ భావోద్వేగాలు, హాస్యం, యాక్షన్ అంశాలను సమతుల్యంగా మిళితం చేశారు. ప్రేక్షకులను ఆకట్టుకునే కథనం, సహజమైన పాత్రల రూపకల్పన సినిమాకు ప్రధాన బలంగా నిలిచాయి.గుల్షన్ దేవయ్య, దిగంత్, గౌతమి, శ్రీముఖి తదితరులు తమ పాత్రల్లో మెప్పించగా, సమంతతో వారి సన్నివేశాలు సినిమాకు మరింత బలం చేకూర్చాయి. వీకెండ్‌లో అనేక ప్రాంతాల్లో థియేటర్లు హౌస్‌ఫుల్‌గా మారాయి. ముఖ్యంగా కుటుంబ ప్రేక్షకుల నుంచి వచ్చిన స్పందన సినిమాను సూపర్ హిట్ దిశగా నడిపిస్తోంది. పలు మల్టీప్లెక్స్‌లతో పాటు సింగిల్ స్క్రీన్ థియేటర్లలో కూడా మంచి ఆక్యుపెన్సీ నమోదవుతోంది.

## అనిల్ రావిపూడి మూవీలో ఛాన్స్ అంటూ ప్రకటనలు

### అవన్నీ ఫేక్..నమ్మొద్దంటూ ప్రకటన విడుదల

ప్రస్తుతం తెలుగు ఇండస్ట్రీలోక్రేజ్ ఉన్న దర్శకుల్లో అనిల్ రావిపూడి ఒకరు. ఆయన మూవీలో నటించేందుకు ఎంతో మంది ఆసక్తి చూపుతారు. దీన్నే అదనుగా తీసుకుని కొంతమంది సరికొత్త మోసానికి తెరలేపారు. ఈ విషయం కాస్తా చిత్ర నిర్మాణ సంస్థ దృష్టికి వెళ్లడంతో అవన్నీ ఫేక్ అంటూ ప్రకటన ఇవ్వాల్సి వచ్చింది. ఇంతకీ ఏం జరిగిందంటే.. వెంకటేశ్, కల్యాణ్‌రామ్ కథానాయకులుగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఓ మూవీ రూపొందుతున్నది. కీర్తి సురేశ్, కృతిశెట్టి కథానాయికలు. ఇటీవల పూజా కార్యక్రమాలతో ఈ మూవీ మొదలైంది. అంతేకాదు, 'రాయల సీమ నేపథ్యం' అంటూ ప్రచారాన్ని కూడా అనిల్ రావిపూడి వినూత్నంగా ప్రారంభించారు. ఈ క్రమంలో ఇందులో నటించే అవకాశం ఇప్పిస్తామంటూ కొంతమంది సామాజిక మాధ్యమాల వేదికగా ప్రకటనలు ఇవ్వడం మొదలు పెట్టారు. దీంతో అవన్నీ ఫేక్ అంటూ నిర్మాణ సంస్థ ÷న్ స్క్రీన్స్ తెలిపింది. మా సినిమా పేరుతో ఒక నకిలీ కాస్టింగ్ కాల్ సోషల్ మీడియా, ఇతర మాధ్యమాల ద్వారా ప్రచారం అవుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఆ కాస్టింగ్ కాల్‌కు, మా చిత్ర బృందానికి ఎలాంటి సంబంధం లేదు. దయచేసి అలాంటి మోసపూరిత ప్రకటనలను నమ్మొద్దు. మా సినిమా తరఫున కాస్టింగ్ పేరుతో సంప్రదిస్తున్న వ్యక్తులకు మీ వ్యక్తిగత వివరాలు, ఫొటోలు, పత్రాలు లేదా డబ్బు ఇవ్వవద్దని విజ్ఞప్తి. మా చిత్రానికి సంబంధించిన ఏవైనా అధికారిక కాస్టింగ్ ప్రకటనలు ఉంటే, అవి కేవలం మా అధికారిక, ధ్రువీకరించిన సోషల్ మీడియా ఖాతాల ద్వారానే ప్రకటిస్తాం. జాగ్రత్తగా ఉండండి. మోసగాళ్ల వలలో పడొద్దని హెచ్చరించారు.





## పవన్‌తో దర్శకుడు మెహర్ రమేశ్ భేటీ

### కూతురు పెళ్లికి రావాలంటూ ఆహ్వానం

దర్శకుడు మెహర్ రమేశ్.. ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను కలిశారు. త్వరలో జరగనున్న తన కుమార్తె వివాహానికి హాజరుకావాలని ఆహ్వానించారు. ఈ ఫొటోలను ఎక్స్ వేదికగా పంచుకున్న దర్శకుడు.. ఎన్నేళ్లయినా పవన్‌తో తన బంధం శాశ్వతమని పేర్కొన్నారు. కొన్నేళ్ల క్రితం విజయవాడలో జరిగిన నా పెళ్లికి పవన్ వచ్చి నన్ను ఆశీర్వదించారు. ఈరోజు నేను విజయవాడ వచ్చి నా కుమార్తె పెళ్లికి పవన్‌ను ఆహ్వానించాను. ఇది నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను. కాలం మారుతుంది.. తరాలు మారతాయి.. కానీ మా సోదర బంధం శాశ్వతం‘ అంటూ పంచుకున్న ఫొటోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. ఏపీ రాష్ట్ర ఫిల్మ్, టీవీ, థియేటర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వైస్ చైర్మన్‌గా ఇటీవల ఏపీ ప్రభుత్వం మెహర్ రమేశ్‌ను నియమించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన మెహర్ రమేశ్ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.


# బాక్సాఫీస్ వద్ద కాక్‌టెయిల్-2 సంచలనం



## భారీ వసూళ్లు రాబడుతున్న మూవీ

బాలీవుడ్‌లో మోస్ట్ అవేటెడ్ సీక్వెల్ మూవీగా థియేటర్లలోకి వచ్చింది 'కాక్‌టెయిల్ 2'. షాహిద్ కపూర్, రష్మిక మందన్న, కృతి సనన్ జంటగా హోమీ అదాజానియా దర్శకత్వంలో వచ్చిన కాక్‌టెయిల్ బాక్సాఫీస్ వద్ద అదిరిపోయే ఓపెనింగ్స్ రాబట్టింది. మొదటి వీకెండ్‌లోనే ఈ సినిమా ఇండియా వ్యాప్తంగా భారీ వసూళ్లతో దూసుకెళ్తోంది. మూడు రోజుల్లోనే మంచి హోల్డ్ సాధించి ట్రేడ్ వర్గాల్లో పాజిటివ్ వైబ్స్ క్రియేట్ చేసింది. ఈ సినిమా బాక్సాఫీస్ ప్రయాణాన్ని గమనిస్తే.. మొదటి రోజు నుంచే సాలిడ్ కలెక్షన్లు నమోదయ్యాయి. మొదటి రోజు రూ. 115.39 కోట్లు, రెండవ రోజు రూ. 19.25 కోట్లు, మూడవ రోజు ఆదివారం రూ. 20.22 కోట్లు రాబట్టి సూపర్ స్ట్రాంగ్ గా హోల్డ్ చేసింది. మొత్తంగా చూసుకుంటే మూడు రోజుల మొదటి వీకెండ్‌లో 'కాక్‌టెయిల్ 2' ఆల్ ఇండియా ట్రాక్డ్ గ్రాస్ కలెక్షన్స్ రూ. 54.86 కోట్లకు అటు ఇటుగా నమోదు చేసింది. సీక్వెల్ హైప్ కు తోడు మౌత్ టాక్ బాగుండటంతో సాలిడ్ కలెక్షన్స్ రాబట్టింది. బాలీవుడ్ బాక్సాఫీస్ పరంగా ఇదొక అద్భుతమైన వీకెండ్ ఓపెనింగ్ అని చెప్పొచ్చు. అయితే పోటీలో మరే ఇతర సినిమాలు లేకపోవడం ఈ సినిమా రన్ కు కాస్త కలిసొచ్చే అంశం. మరి వీక్‌డేస్‌లో ఈ సినిమా ఎలాంటి ఇంపాక్ట్ క్రియేట్ చేస్తుందో చూడాలి. రూ. 150కోట్లతో తెరకెక్కిన కాక్‌టెయిల్ 2 ఫైనల్ రన్ లో ఎంత సాధిస్తుందో చూడాలి.

# కోహ్లీ టెస్టుల్లోకి రీఎంట్రీ ఇస్తాడా..?



స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ తన టెస్ట్ క్రికెట్ రీఎంట్రీ వార్తలకు పూర్తిగా తెరదించాడు. తన వన్8 బ్రాండ్ షూ లాంచ్ ఈవెంట్‌లో హోస్ట్ అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ.. టెస్ట్ క్రికెట్‌తో తన పని అయిపోయిందని స్పష్టం చేశాడు. కోహ్లీ తన టెస్ట్ కెరీర్‌లో చేసిన మొత్తం పరుగులు 9,230 కాగా, దానికి గుర్తుగా కొత్త షూ ధరను కూడా రూ. 9,230 గానే నిర్ణయించడం విశేషం. ప్రస్తుతం కోహ్లీ దృష్టి కేవలం వన్డే ఫార్మాట్ పైనే ఉంది. విరాట్ కోహ్లీ .. ప్రపంచ క్రికెట్‌లో పరిచయం అక్కర్లేని పేరు. ఎన్నో రికార్డులు అతడి సొంతం. ఛేజ్ మాస్టర్‌గా పేరుపొందిన విరాట్ కోహ్లీ.. భారత్‌కు ఎన్నో అపురూప విజయాలు అందించాడు. ప్రపంచ క్రికెట్‌లో రికార్డులు బద్దలు కొట్టాడు. అయితే ప్రస్తుతం కోహ్లీ అంతర్జాతీయ క్రికెట్ కెరీర్ ముగింపు దశకు వచ్చింది. ఇప్పటికే టీ20, టెస్టులకు గుడ్ బై చెప్పేశాడు కోహ్లీ. కేవలం వన్డేలు మాత్రమే ఆడుతున్నాడు. వచ్చే ఏడాది జరిగే వన్డే ప్రపంచకప్ 2027 కోహ్లీ కెరీర్‌లో చివరి ఈవెంట్ అయ్యే అవకాశం ఉందనే అంచనాలు ఉన్నాయి. అయితే ఇటీవల కొన్ని వార్తలు సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతున్నాయి. టెస్ట్ క్రికెట్‌కే ప్రత్యేక గుర్తింపు తెచ్చిన కింగ్.. రిటైర్మెంట్ వెనక్కి తీసుకుని మళ్లీ రీఎంట్రీ ఇస్తాడనే వార్తలు వస్తున్నాయి. అభిమానులు కూడా ఈ వార్తలు నిజం కావాలని కోరుకుంటున్నారు. అతడిలో ఇంకా క్రికెట్ ఉందని.. టెస్ట్ క్రికెట్‌కు అతడి అవసరం ఉందని పేర్కొంటున్నారు. అయితే ఇదే విషయంపై ఇటీవల ఓ కార్యక్రమంలో పాల్గొన్న కోహ్లీకి ప్రశ్న ఎదురైంది. దీనికి అతడు తనదైన శైలిలో సమాధానమిచ్చాడు. ఇటీవల కోహ్లీ స్పోర్ట్స్ బ్రాడ్ వన్8 లాంచ్ ఈవెంట్‌లో పాల్గొన్నాడు. ఈ బ్రాండ్‌లో ఓ షూ ధర రూ. 9,230గా ఉంది. టెస్ట్ క్రికెట్‌లో కోహ్లీ సాధించిన పరుగులు సైతం 9,230 కావడం గమనార్హం. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ హోస్ట్.. కోహ్లీని ఉద్దేశించి ఓ ప్రశ్న అడిగాడు. "విరాట్ మీరు ఇంకొన్ని రన్స్ చేసి.. ఆ షూ లాభాలు పెంచొచ్చు కదా?" అని అడిగాడు. దీనికి కోహ్లీ "నేను తక్కువ ధరకే అమ్మేయడానికి ఇష్టపడతా. మీరు ఏదైతే అడుగుతున్నారో దానితో.. (టెస్ట్ క్రికెట్‌ను ఉద్దేశిస్తూ.. ) నా పని అయిపోయింది. థాంక్యూ" అని విరాట్ కోహ్లీ సమాధానమిచ్చాడు. కోహ్లీ సమాధానంతో అతడు మళ్లీ టెస్ట్ క్రికెట్‌లో ఆడబోడనే విషయం స్పష్టమైంది. కోహ్లీ.. త్వరలో ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్‌లో బరిలోకి దిగే అవకాశం ఉంది.

# ఇంగ్లాండ్ జట్టులోకి స్టోక్స్ అడుగు



న్యూజిలాండ్‌తో జూన్ 25 నుంచి ట్రెంట్ బ్రిడ్జ్ వేదికగా ప్రారంభం కానున్న మూడో టెస్టు కోసం ఇంగ్లాండ్ జట్టులోకి బెన్ స్టోక్స్, గస్ అట్కిన్సన్ తిరిగి వచ్చారు. లండన్ నైట్ క్లబ్‌లో రగ్బీ ఆటగాడితో ఘర్షణ పడి ఈసీబీ నిబంధనలు ఉల్లంఘించినందుకు వీరిని రెండో టెస్టుకు దూరం పెట్టారు. ప్రస్తుతం సిరీస్ 1-1తో సమం కావడంతో, ఈ నిర్ణయాత్మక ఆఖరి టెస్టులో బెన్ స్టోక్స్ తిరిగి కెప్టెన్‌గా ఇంగ్లాండ్ జట్టును నడిపించనున్నాడు. న్యూజిలాండ్‌తో జూన్ 25 నుంచి ట్రెంట్ బ్రిడ్జ్ వేదికగా ప్రారంభం కానున్న మూడో టెస్టుకు ఇంగ్లాండ్ జట్టులో బెన్ స్టోక్స్ , గస్ అట్కిన్సన్ జట్టులో చోటు దక్కించుకున్నారు. తొలి టెస్టులో ఇంగ్లాండ్ విజయం సాధించిన తర్వాత లండన్ నైట్ క్లబ్‌లో జరిగిన సంఘటన తరువాత వీరిద్దరినీ జట్టు నుంచి తప్పించారు. కానీ మూడో టెస్టుకు ముందు వీరిద్దరూ తిరిగి జట్టులోకి వచ్చారు. బెన్ స్టోక్స్ తిరిగి సారథ్య బాధ్యతలు చేపడతాడని ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు ధ్రువీకరించింది.కాగా లార్డ్స్‌తో న్యూజిలాండ్‌తో టెస్టు మ్యాచ్ ముగిసిన తర్వాత జూన్ 8న స్టోక్స్, అట్కిన్సన్ ఇద్దరూ ఓ నైట్ క్లబ్‌కు వెళ్లారు. నిజానికి ఇలా వెళ్లేందుకు వారికి అనుమతి లేదు. అయినా ఈసీబీ నిబంధలను ఉల్లంఘించి వారు అక్కడికి వెళ్లారు. నైట్ క్లబ్‌లో రగ్బీ ఆటగాడు టోటోవా ఔవాతో వీరు ఘర్షణకు దిగినట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో ఓ సెక్యూరిటీ సిబ్బందికి కూడా గాయాలు కావడంతో విషయం ముదిరింది. దీంతో వారిని జట్టు నుంచి తప్పించారు. ఆ తర్వాత బెన్ స్టోక్స్, అట్కిన్సన్ వెళ్లి కౌంటీల్లో ఆడారు. కానీ ఈసీబీ సూచన మేరకు కౌంటీల్లో తమ తర్వాతి మ్యాచుకు వీరు దూరమయ్యారు. న్యూజిలాండ్‌తో మూడో టెస్టు కోసం ఎంపిక చేసిన జట్టులో చోటు సంపాదించారు. కాగా లార్డ్స్‌లో జరిగిన తొలి టెస్టులో ఇంగ్లాండ్.. న్యూజిలాండ్‌ను చిత్తు చేసింది. కానీ రెండో టెస్టులో మాత్రం 253 పరుగుల తేడాతో చిత్తుగా ఓడింది. దీంతో రెండు టెస్టులు ముగిసే సరికి సిరీస్ 1-1తో సమమైంది. నిర్ణయాత్మక మూడో టెస్టు జూన్ 25 నుంచి ట్రెంట్ బ్రిడ్జ్ వేదికగా జరగనుంది. ఈ మ్యాచు ఫలితం సిరీస్ విజేత ఎవరో తేల్చనుంది.

## బ్యాటింగ్ ఆర్డర్‌లో మార్పు చేయాలి

### భారత బ్యాటింగ్ దిగ్గజం మిథాలీ రాజ్ సూచన



ఆదివారం ఓల్డ్ ట్రాఫోర్డ్ మైదానంలో దక్షిణాఫ్రికాతో జరిగిన ఉమెన్స్ టీ20 వరల్డ్ కప్ మ్యాచ్‌లో భారత జట్టు 6 వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. ఈ ఓటమిపై భారత బ్యాటింగ్ దిగ్గజం మిథాలీ రాజ్ స్పందిస్తూ.. టీమిండియా బ్యాటింగ్ ఆర్డర్‌లో ఒక చిన్న మార్పు చేయాలని సూచించారు. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌ను 5వ స్థానానికి బదులుగా 4వ స్థానంలో బ్యాటింగ్‌కు పంపించాలని, అలాగే జెమిమా రోడ్రిగ్స్‌ను 5వ స్థానంలో ఆడించాలని ఆమె ప్రతిపాదించారు.ఈ మ్యాచ్‌లో గెలిచి ఉంటే భారత్ గ్రూప్-ఎ పట్టికలో అగ్రస్థానానికి చేరుకుని, సెమీఫైనల్ అవకాశాలను మరింత మెరుగుపరుచుకునేదని, కానీ ఈ ఓటమితో ఇకపై టోర్నమెంట్‌లో భారత్‌కు తప్పులు చేసే అవకాశం లేదని మిథాలీ పేర్కొన్నారు. మిథాలీ రాజ్ మాట్లాడుతూ--- "భారత్‌కు ఇది నిరాశాజనకమైన మ్యాచ్. ఈ మ్యాచ్ గెలిచి ఉంటే పట్టికలో అగ్రస్థానంలో నిలిచేవారు. కానీ ఇప్పుడు సెమీస్‌కు చేరాలంటే ఆస్ట్రేలియాపై ఖచ్చితంగా గెలవాల్సిన పరిస్థితి వచ్చింది. బ్యాటింగ్ ఆర్డర్ పరంగా చూస్తే, హర్మన్‌ప్రీత్ కౌర్ 5వ స్థానంలో అంత లేట్‌గా బ్యాటింగ్‌కు రావడం మనం తరచుగా చూడలేదు. కాబట్టి ఆమె 4వ స్థానంలో, జెమిమా 5వ స్థానంలో వస్తే బాగుంటుంది. జెమిమా గతంలో 5వ స్థానంలో ఆడి చాలా పరుగులు చేసింది. ఆమె క్రీజులోకి వచ్చే సమయానికి స్పిన్నర్లు బౌలింగ్ చేసే అవకాశం ఉంటుంది. స్పిన్‌ను ఆడటం జెమిమా బలం. ఆమె క్రీజు వెలుపలికి వచ్చి ఆడటంతో పాటు స్కూప్స్, స్వీప్ షాట్లు బాగా ఆడుతుంది. హర్మన్‌ప్రీత్ ముందుగా వచ్చి, ఆ తర్వాత జెమిమా వస్తే ఆమెకు ఫామ్‌లోకి రావడానికి, మంచి రిథమ్ అందుకోవడానికి సహాయపడుతుంది" అని అన్నారు. ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన భారత్ 158 పరుగుల పోటీతత్వ స్కోరు సాధించి మ్యాచ్‌పై పట్టు సాధించినట్లే కనిపించింది. అయితే దక్షిణాఫ్రికా బ్యాటర్ మరిజానే కాప్ కేవలం 45 బంతుల్లోనే 81 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచి, చివరి ఓవర్లో తన జట్టును గెలిపించింది. ఈ టోర్నమెంట్‌లో భారత్‌కు ఇది మొదటి ఓటమి. దీంతో నాకౌట్ దశకు వెళ్లే మార్గం క్లిష్టంగా మారింది.మ్యాచ్ ఓడిపోయినప్పటికీ, యువ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ శ్రీ చరణి ప్రదర్శనను మిథాలీ రాజ్ ప్రత్యేకంగా అభినందించారు. శ్రీ చరణి ఒకే ఓవర్లో రెండు కీలక వికెట్లు తీసి దక్షిణాఫ్రికాను 25/2 స్కోరు వద్ద దెబ్బతీసి భారత్‌ను తిరిగి మ్యాచ్‌లోకి తెచ్చింది. శ్రీ చరణి గురించి మిథాలీ మాట్లాడుతూ--- "శ్రీ చరణి త్వరగా నేర్చుకునే ఆటగాడు. ఇంగ్లండ్ వాతావరణంలోనే ఆమె అరంగేట్రం చేసింది కాబట్టి ఇక్కడి పరిస్థితులపై ఆమెకు అవగాహన ఉంది. పిచ్ నుండి స్పిన్నర్లకు పెద్దగా సహకారం లేకపోయినప్పటికీ, ఆమె స్థిరంగా స్టంప్స్‌ను లక్ష్యంగా చేసుకుని బౌలింగ్ చేసింది. వేగాన్ని, లెంగ్త్‌ను మారుస్తూ తనకు కావాల్సిన ఫీల్డింగ్‌ను సెట్ చేసుకుంది. రెండో స్పెల్‌లోనూ ఆమె చాలా కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి పరుగులను నియంత్రించింది" అని కొనియాడారు. రెండు క్యాచ్‌లు డ్రాప్ అవ్వడం, కాప్ అద్భుత బ్యాటింగ్ కారణంగా భారత్ మ్యాచ్‌ను కాపాడుకోలేకపోయింది.

## నెయ్‌మార్ రీఎంట్రీ ఖాయం..!



ఫిఫా వరల్డ్ కప్ 2026 లో సరికొత్త డ్రామా స్టార్ట్ అయింది. బ్రెజిల్ సూపర్‌స్టార్ నెయ్‌మార్ జూనియర్ ఫ్యాన్స్ కు పూనకాలు తెప్పించే ఒక బిగ్ అప్‌డేట్ . నార్త్ అమెరికాలో జరుగుతున్న ఈ మెగా టోర్నమెంట్‌లో కాఫ్ ఇంజరీ వల్ల ఫస్ట్ రెండు గ్రూప్ మ్యాచులకు దూరమైన నెయ్‌మార్, ఇప్పుడు కంప్లీట్ ఫిట్‌నెస్ సాధించి గ్రౌండ్ లోకి అడుగుపెట్టాడు. ఆదివారం తను ట్రైనింగ్ సెషన్‌లో పాల్గొన్న పిక్చర్స్ ను ఎక్స్ లో షేర్ చేస్తూ.. "థాంక్యూ గాడ్, నేను చాలా హ్యాపీగా ఉన్నా!!" అంటూ ఎమోషనల్ క్యాప్షన్ పెట్టాడు. స్కాట్లాండ్‌తో బుధవారం జరగబోయే డిసైడింగ్ గ్రూప్-జ మ్యాచ్ లో నెయ్‌మార్ ఆడటం దాదాపు ఖాయమనే హింట్ ఈ పోస్ట్ ద్వారా క్లియర్ గా అర్థమవుతోంది. నెయ్‌మార్ లేనప్పటికీ బ్రెజిల్ టీమ్ ఫస్ట్ మ్యాచ్ లో మొరాకోతో 1-1 తో డ్రా చేసుకుని, ఆ తర్వాత హైతీని 3-0 తో ఓడించి గ్రూప్-జ లో టాప్ పొజిషన్ కు చేరింది. బ్రెజిల్ స్క్వాడ్ హైతీ మ్యాచ్ కోసం ఫిలడెల్ఫియా వెళ్లినప్పుడు, నెయ్‌మార్ మాత్రం న్యూజెర్సీలోని ట్రైనింగ్ బేస్ లోనే ఉండి తన పర్సనల్ రిహాబిలిటేషన్ ప్రోగ్రామ్ కంటిన్యూ చేశాడు. వీకెండ్ లో అతను ఆన్-ఫీల్డ్ వర్క్ స్టార్ట్ చేసి ఫిజికల్, బాల్ డ్రిల్స్ లో పార్టిసిపేట్ చేశాడు. బ్రెజిల్ హెడ్ కోచ్ కార్లో అన్సెలోటి కూడా నెయ్‌మార్ కంబ్యాక్ ను కన్ఫర్మ్ చేశాడు. "నెయ్‌మార్ సోమవారం నుంచి టీమ్‌తో కలిసి ఫుల్ ట్రైనింగ్ సెషన్‌లో పాల్గొంటాడు. స్కాట్లాండ్‌తో జరిగే బిగ్ మ్యాచ్ లో ఆడేందుకు తను అవైలబుల్ గా ఉంటాడు" అని అన్సెలోటి మీడియా ముందు స్పష్టం చేశాడు.ఒకవేళ స్కాట్లాండ్ మ్యాచ్ లో నెయ్‌మార్ ప్లేయింగ్ ఎలెవన్ లోకి వస్తే, అక్టోబర్ 2023 తర్వాత బ్రెజిల్ జెర్సీలో అతనికి ఇదే ఫస్ట్ మ్యాచ్ అవుతుంది. అప్పట్లో ఉరుగ్వేతో జరిగిన వరల్డ్ కప్ క్వాలిఫైయర్ మ్యాచ్ లో నెయ్‌మార్ మోకాలికి తీవ్రమైన ఏసీఎల్ ఇంజరీ అయింది. ఈ సర్జరీ వల్ల అతను చాలా కాలం పాటు ఇంటర్నేషనల్ ఫుట్‌బాల్ కు దూరం కావాల్సి వచ్చింది. బ్రెజిల్ క్వాలిఫికేషన్ క్యాంపెయిన్ లో కూడా తను ఎక్కువ మ్యాచ్‌లు ఆడలేకపోయాడు. కాగా, నెయ్‌మార్ కెరీర్ లో ఇది ఫోర్త్ ఫిఫా వరల్డ్ కప్ కావడం విశేషం. గతంలో 2014, 2018, 2022 వరల్డ్ కప్‌లలో బ్రెజిల్ తరపున ఆడి తన క్లాస్ చూపించాడు. గాయాలతో ఇబ్బంది పడుతున్నప్పటికీ క్వాలిఫైయింగ్ రౌండ్ లో నెయ్‌మార్ ఆడిన నాలుగు మ్యాచుల్లోనే రెండు గోల్స్, మూడు అసిస్ట్ లతో కీ రోల్ ప్లే చేశాడు. ఇప్పుడు క్రీడల ప్రపంచంలో మోస్ట్ పాపులర్ అయిన నంబర్ 10 జెర్సీ స్టార్ మళ్లీ టీమ్ లోకి రావడం బ్రెజిల్‌కు కొండంత బలాన్ని ఇస్తోంది. స్కాట్లాండ్‌ను ఓడించి ఈజీగా నాకౌట్ రౌండ్ కు చేరాలనే ప్లాన్ లో ఉన్న బ్రెజిల్ టీమ్‌కు నెయ్‌మార్ ఎంట్రీ ఒక బిగ్ బూస్ట్ లాంటిది. గురువారం జరగబోయే ఈ మ్యాచ్ లో నెయ్‌మార్ ఎలాంటి మ్యాజిక్ క్రియేట్ చేస్తాడో చూడాలని ఫుట్‌బాల్ వరల్డ్ అంతా ఈగర్‌గా వెయిట్ చేస్తోంది.

## నా గురించి జనాలకు తెలియదు: వైభవ్ సూర్యవంశీ



తాను 50 ఓవర్ల క్రికెట్‌ను చాలా ఆడానని, ఆ విషయం జనాలకు తెలియదని టీమిండియా టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ అన్నాడు. వరుసగా మూడు మ్యాచ్‌ల్లో విఫలమైనా తనపై ఎలాంటి ఒత్తిడి లేదని స్పష్టం చేశాడు. శ్రీలంక గడ్డపై ముక్కోణపు వన్డే సిరీస్‌లో భాగంగా ఆదివారం జరిగిన ఫైనల్లో వైభవ్ సూర్యవంశీ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. 11 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించి ప్రపంచ రికార్డ్‌ను నమోదు చేశాడు. లిస్ట్-ఏ క్రికెట్‌లో ఇదే అత్యంత వేగవంతమైన హాఫ్ సెంచరీ . శ్రీలంక ఆటగాడు కుశాల్య వీర రత్నే(12 బంతులు) 20 ఏళ్ల ముందు నెలకొల్పిన రికార్డ్‌ను వైభవ్ తాజా ఇన్నింగ్స్‌తో బద్దలు కొట్టాడు. ఈ సంచలన ప్రదర్శనతో భారత్-ఏ 66 పరుగుల తేడాతో విజయం సాధించింది. భారత్-ఏ విజయంలో కీలక పాత్ర పోషించిన వైభవ్ సూర్యవంశీకి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. ఈ సందర్భంగా మాట్లాడిన వైభవ్ సూర్యవంశీ తనపై వచ్చిన విమర్శలపై స్పందించాడు. అలాగే ఈ సిరీస్ నుంచి చాలా విషయాలు నేర్చుకున్నట్లు వెల్లడించాడు. 'రికార్డ్ గురించి నాకు తెలియదు. దాని గురించి ఆలోచించ లేదు. నా ప్రణాళికలను మాత్రమే అమలు చేశా. తొలి 10 ఓవర్లలో ఎలా ఆడాలనుకున్నానో అదే చేసి చూపించా. నాపై ఎలాంటి ఒత్తిడి లేదు. ఈ సిరీస్ ఆరంభంలో నేను అనుకున్న విధంగా ఆడలేదు. కోచ్‌లతో మాట్లాడి.. రిథమ్‌ను అందుకొన్నా. నా తప్పిదాలను సరిదిద్దుకున్నా. నేను 50 ఓవర్ల క్రికెట్ చాలా ఆడా. ఆ విషయం ప్రజలకు తెలియదు. విభిన్న పరిస్థితుల్లో ఎదురయ్యే సవాళ్లను తీసుకోవడం ఇష్టపడతా. ఇప్పుడు ఫైనల్లో మంచి ఇన్నింగ్స్ ఆడటం బాగుంది.'అని వైభవ్ సూర్యవంశీ చెప్పుకొచ్చాడు.

# ఫిఫా వరల్డ్‌కప్‌లో చరిత్ర సృష్టించిన ఈజిప్ట్?

## న్యూజిలాండ్‌పై ఈజిప్ట్ 1-3 తేడాతో విజయం



2026 ఫిఫా వరల్డ్‌కప్‌లో ఈజిప్ట్ చరిత్ర సృష్టించింది. వరల్డ్?కప్?లోనే తొలి విజయం నమోదు చేసింది. తాజాగా గ్రూప్ జీలో భాగంగా న్యూజిలాండ్?తో జరిగిన మ్యాచ్?లో ఈజిప్ట్ 1-3 తేడాతో విజయం సాధించింది. ఫలితంగా ఫిఫా హిస్టరీలోనే తొలిసారి గెలుపు రుచి చూసింది. దీంతో ఈజిప్ట్ అభిమానుల సంబరాలకు హద్దుల్లేకుండా పోయాయి. ఈ ప్రతిష్ఠాత్మక టోర్నమెంట్?లో ఈజిప్ట్ 1934లో ఎంట్రీ ఇచ్చింది. అప్పట్నుంచి 92 ఏళ్లు గడిచినా ఈ మ్యాచ్?కు ముందు ఒక్క విజయం కూడాసాధించలేదు. కానీ తాజా మ్యాచ్?లో జికో, సలాహ్, ట్రెజెగెట్ అద్భుతమైన రీతిలో గోల్స్ సాధించడంతో ఫిఫాలో తొలి విజయం అందుకోగలిగింది. ఇది ఈజిప్ట్? ఫుట్?బాల్ చరిత్రలో నిలిచిపోనుంది! వాంకోవర్‌లోని దీజ ప్లేస్ గ్రౌండ్?లో న్యూజిలాండ్?ను ఈజిప్ట్ ఢీ కొట్టింది. అయితే ఈజిప్ట్? కంటే మెరుగైన న్యూజిలాండ్ జట్టు ఆటను దూకుడుగానే ప్రారంభించింది. ఆరంభంలోనే కివీస్ ప్లేయర్లు సర్‌ప్రీత్ సింగ్, ఎలిజా జస్ట్ గోల్స్ చేసేందుకు ప్రయత్నించినా ఈజిప్ట్ అడ్డుకుంది. అయితే 15వ నిమిషంలో కార్నర్ నుంచి వచ్చిన బంతిని ఫిన్ సుర్మాన్ బుల్లెట్ వేగంతో గోల్ చేసి న్యూజిలాండ్?ను ఆధిక్యంలోకి తీసుకెళ్లాడు. దీనికి ఈజిప్ట్ కూడా గట్టిగానే బదులిచ్చింది. స్కోరును సమం చేసేందుకు తీవ్రంగా ప్రయత్నించింది. అయితే ఫస్టాఫ్ ముగిసే ముగింట సలాహ్, ఇమామ్ అషూర్ ఇద్దరూ గోల్ చేసేందుకు దగ్గరగా వచ్చారు. కానీ న్యూజిలాండ్ అడ్డుకోవడంతో 1-0తో ఈజిప్ట్ వెనుజంలో తొలి భాగం ముగించింది. అయితే సెంకడ్ హాఫ్?లో ఈజిప్ట్ అద్భుతంగా పోరాడింది. ఆట ప్రారంభమైన కొద్ది సేపటికే న్యూజిలాండ్ మరో గోల్?కు దగ్గరగా వెళ్లింది. కాలమ్ మెక్‌కోవాట్ తలతో కొట్టిన బంతిని, ఈజిప్ట్ గోల్ కీపర్ మొస్తఫా షోబీర్ అద్భుతంగా అడ్డుకున్నాడు. అనంతరం ఈజిప్ట్ ఆటగాడు జీకో ఫ్రీ హెడర్ (58వ నిమిషం) గోల్ కొట్టి స్కోర్లను సమం చేశాడు. ఆ తర్వాత తొమ్మిది నిమిషాలకే సలాహ్ (67వ ని) బంతిని నెట్‌లోకి పంపించి ఈజిప్ట్?కు ఆధిక్యం అందించాడు. దీంతో ఈజిప్ట్? సంబరాల్లో మునిగిపోయింది. ఈ లీడ్?ను అలాగే కాపాడుకుంటూ ఈజిప్ట్? మ్యాచ్? ఎండింగ్ దాకా తీసుకెళ్లింది. ఆట ముగియడానికి ఎనిమిది నిమిషాలు ఉండగా ఈజిప్ట్ తరపున ట్రెజెగెట్ (82 వ ని) మూడో గోల్ చేసి విజయాన్ని జట్టుకు విజయం ఖరారు చేశాడు. దీంతో ఈజిప్ట్ సంబరాల్లో మునిగిపోయింది. తాజా విజయంతో ఈజిప్ట్ గ్రూప్ జీ పాయింట్ల పట్టికలో టాప్?లోకి దూసుకెళ్లింది. దీంతో నాకౌట్ దశకు చేరువైంది. రెండు మ్యాచ్?ల్లో ఒక డ్రా, ఒక గెలుపుతో ఈజిప్ట్ ఖాతాలో ప్రస్తుతం నాలుగు పాయింట్లు ఉన్నాయి. మరోవైపు ఈ ఓటమితో నాలుగో స్థానంలో (1 పాయింట్) ఉంది. ఇరాన్ రెండో (2 పాయింట్లు), బెల్జియం (2 పాయింట్లు)మూడో ప్లేస్?లో ఉన్నాయి.

Printed, published and edited by Makam Gangadhar H. No. 11-5-565, Bhagyalaxmi Towers, Venkateswara Colony, saroornagar, Ranga Reddy Dist. 500 035. T. GOwened by Makam Gangadhar and Printed at Ratna Graphics, H. No. 2-3-703/7, Tirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500013 T. G.H. No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Rangareddy Dist. 500 035. T. G. Editor & Managing Director : Makam Gangadhar +919393446188, PRGI No. TGTEL/2026/A1889